# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com   ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433   E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్   శనివారం 10-1-2026   NETI NIZAM Telugu Daily,   RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026.   Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001.   సంపుటి :32   సంచిక:127   పేజీలు:6   వెల: రూ.1/-


**నేటి కందం- నేటికి అందం**

కమనీయ చిత్రములతో
రమణీయములైనయట్టి రసకవితలతో
ప్రముదముల నిడు కళలతో
"అమరావతి ఆవకాయ" అందరి దయ్యేన్ !!

(సినిమాలతో,కవితలతో,కళలతో "అమరావతి ఆవకాయ"ఉత్సవం అందరి మన్ననలనూ అందుకొంటుందని ఉత్సవాలను ప్రారంభిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు.)

-రాధశ్రీ

సెల్:9494481210




**చురక**

నిస్తేజం ఎందుకాయే
నిత్య ఉద్యమాల నెగడు
నిప్పులాగ రగలాల్సిన
నిబద్ధత పోరు దగడు
సమస్యలు కోకొల్లలు
సమరాలకు లేవెల్లలు
చీలికలై చితికిపోతే
సమ లక్ష్యం ఇక కల్లలు

-వేల్పుల నారాయణ

9440433475



## వివాదాలు వద్దు.. పరస్పర సహకారం అవసరం: సీఎం రేవంత్



హైదరాబాద్, జనవరి 9:కృష్ణా నది జల వివాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాల ఈ-సిటీలో సుజెన్ మెడికేర్ ప్రైవేట్ లిమిటెడ్ ఫార్మా యూనిట్ ప్రారంభోత్సవంలో సీఎం పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రానికి పంచాయితీ కావాలా, నీళ్లు కావాలా అని అడిగితే తాను నీళ్లే కావాలని కోరుకుంటానని స్పష్టం చేశారు. వివాదం కావాలా, పరి ష్కారం కావాలా అని అడిగితే పరిష్కారమే కావాలని కోరుకుంటానని ఆయన అన్నారు.

నీళ్ల వివాదం ముసుగులో రాజకీయ లబ్ధి పొందాలన్న ఆలోచన కాంగ్రెస్ పార్టీకి లేదని, రాజకీయాలకు అతీతంగా సమస్యల పరిష్కారం కోసం అందరూ సహకరించాలని పార్టీలను విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. మన సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుందామని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

### ఏపీ సీఎంకు విజ్ఞప్తి..

ఈ వేదికగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి విజ్ఞప్తి చేస్తూ.. కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులకు అడ్డంకులు పెట్టవద్దని కోరారు. అడ్డంకుల వల్ల కేంద్ర ప్రభుత్వ నిధులు రావడం లేదని, రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము వివాదం కోరుకోవడం లేదని.. పరిష్కారమే కోరుకుంటున్నామని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాలు కాదని.. ప్రజలు, రైతుల ప్రయోజనాల కోసమే ఆలోచిసున్నామని రేవంత్ రెడ్డి స్పష్టీకరించారు.

### చర్చలు కొనసాగుతాయి..

తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ రావాలంటే పక్క రాష్ట్రం సహకారం అవసరమన్నారు. రెండు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకోకపోతే సమస్యలు పరిష్కారం కావని చెప్పుకొచ్చారు.

ఇందుకోసం పక్క రాష్ట్రంతో చర్చలు కొనసాగుతాయని తెలిపారు. ఏపీ అయినా, కర్ణాటక అయినా, తమిళనాడు అయినా, మహారాష్ట్ర అయినా.. పక్క రాష్ట్రాలతో వివాదాలు కోరుకోవడం లేదని, పరస్పర సహకారమే కోరుకుంటున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాశ్ గౌడ్, మల్ రెడ్డి రంగారెడ్డి, కాలె యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

## జనవరి 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు!

న్యూఢిల్లీ జనవరి 9 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: వచ్చే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో జనవరి 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. తొలిరోజు పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారు. ఫిబ్రవరి 1న 2026-27 వార్షిక బడ్జెట్ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెడతారు. అయితే ఈ సారి ఫిబ్రవరి 1 ఆదివారం రావడంతో బడ్జెట్ను ప్రవేశపెడతారా లేదా అనే సందేహాలు తలెత్తుతున్న క్రమంలో ఇప్పుడు సర్వత్రా చర్చ నడుస్తోంది. మరోపక్క ప్రభుత్వం ప్రవేశపెట్టే ఈ బడ్జెట్పై మధ్య తరగతి ప్రజలు, రైతులు, యువత? కోటి ఆశలు పెట్టుకున్నారు. ఏటా ఫిబ్రవరి 1న బడ్జెట్ను ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తోంది. 2017 నుంచి ఇదే సంప్రదాయం కొనసాగుతోంది. అయితే, ఈ సారి ఫిబ్రవరి 1న ఆదివారం రావడం, ఆ రోజు సెలవు దినం కావడంతో బడ్జెట్ ప్రవేశపెడతారా..? లేదా? అనే దానిపై సందిగ్ధత నెలకొంది. ప్రభుత్వం బడ్జెట్ను ఫిబ్రవరి 2న ప్రవేశపెట్టొచ్చన్న అభిప్రా యాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ఈ అంశం ఆసక్తికరంగా మారింది. అయితే, దీనిపై కేబినెట్ కమిటీ నిర్ణయం తీసుకుం టుందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు.

అయితే, వారాంతాల్లోబడ్జెట్ ప్రవేశపెట్టడం కొత్తే కాదు. 2016లో తొలిసారి అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వార్షిక బడ్జెట్ను ఆదివారమే ప్రవేశపెట్టారు. ఆ తరువాత 2025లో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం బడ్జెట్ను ప్రవేశపెట్టారు. గతంలో ఆదివారాల్లో పార్లమెంట్ సమావేశమైన సందర్భాలూ ఉన్నాయి. కరోనా సమయంలో (2020), అలాగే పార్లమెంట్ తొలి సమావేశం 60వ వార్షికోత్సవం సందర్భంగా 2012, మే13న ఆదివారం సభ జరిగింది. ఈ లెక్కన పార్లమెంటరీ సంప్రదాయాలను అనుసరిస్తే, ఆదివారం కూడా బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం లేకపోలేదు.

## లోయలో పడిని టూరిస్టు బస్సు.. 8 మంది మృతి

సిమ్లా, జనవరి 9:: హిమాచల్ ప్రదేశ్ లోని సిర్మౌర్ జిల్లాలో భారీ రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రైవేటు బస్సు లోయలో పడి 8 మంది ప్రయాణికులు మృతిచెందారు. పలువురు తీవ్రంగా గాయపడటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. కుప్వి నుంచి సిమ్లాకు బస్సు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగినప్పుడు బస్సులో 30 నుంచి 35 మంది ప్రయాణిస్తున్నట్టు తెలుస్తోంది.

పోలీసు వర్గాల సమాచారం ప్రకారం హరిపుర్ధార్ ఏరియాలోని ఇరుకైన రహదారిపై వెళ్తుండగా బస్సు అదుపుతప్పి లోయలో పడింది. సహాయక కార్యక్రమాలు చేపట్టినట్టు సిర్మౌర్ ఎస్పీ నిశ్చింత్ సింగ్ నెగి తెలిపారు. తొలుత ప్రమాద స్థలికి చేరుకున్న స్థానికులు అత్యవసర సహాయక బృందాలు అక్కడికి చేరుకోకముందే సహాయక చర్యలు చేపట్టారు. పలువురు క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించారు. మరికొందరికి సీరియస్‌గా ఉండటంతో హెయర్ మెడికల్ సెంటర్లకు తరలిస్తున్నట్టు నిశ్చింత్ సింగ్ చెప్పారు.


కాగా, ఈ ఘటనపై ముఖ్యమంత్రి సుఖేందర్ సింగ్ సుఖు విచారం వ్యక్తం చేశారు. బాధితులకు అన్ని రకాలుగా సహాయం అందించాలని జిల్లా యంత్రాంగానికి ఆదేశాలిచ్చినట్టు చెప్పారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నట్టు చెప్పారు.

## కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్‌కు ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ సాదర ఆహ్వానం



హైదరాబాద్ జనవరి 9 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఉప్పల్ లో ఉన్న సి డి ఎఫ్ డి బిల్డింగ్ ప్రాంగణంలో బయోటెక్నాలజీ మరియు లైఫ్ సైన్సెస్ పై జరుగుతున్న జాతీయ సెమినార్ లో పాల్గొనటానికి విచ్చేసిన కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక రంగాల మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ను ఉప్పల్ బిజెపి మాజీ శాసనసభ్యుడు ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ సాదరంగా ఆహ్వానించి అభినందించారు. చిత్రంలో సిడిఎఫ్ డి డైరెక్టర్ ఉల్లాస్ కొల్తాస్ శ్రీరామన్ , మరియు ఐఐసిటి డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఎన్ జి ఆర్ ఐ డైరెక్టర్ ప్రకాష్ కుమార్ తదితరులు

## సైబర్ బాధితులకు అండగా పోలీసులు: సీపీ సజ్జనార్




హైదరాబాద్, జనవరి 9:సైబర్ నేరాల బాధితులకు హైదరాబాద్ పోలీసులు ఎల్లప్పుడు అండగా ఉంటారని నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. శుక్రవారం నాడు హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ సీసీఎస్ కార్యాలయంలో సైబర్ మిత్ర పేరుతో రూపొందించిన ప్రత్యేక విభాగాన్ని సజ్జనార్ ప్రారంభించారు. అనంతరం సీపీ సజ్జనార్ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లకు చిక్కిన బాధితులకు ఈ సెల్ ఎంతో సహాయంగా ఉంటుందన్నారు. దేశంలోనే తొలి సారిగా హైదరాబాద్‌లో సైబర్ క్రైమ్‌పై హెల్ప్ డెస్క్ ఏర్పాటైందని వివరించారు. సైబర్ క్రైమ్‌ల్లో బాధితుల సంఖ్య పెరుగుతోందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్ క్రైమ్‌కు గురైన వెంటనే 1930కి ఫోన్ చేయాలని బాధితులకు సూచించారు.

సైబర్ దాడికి గురైతే మ్యూల్ ఖాతాలకు నగదు బదిలీ అయి.. విత్ డ్రా చేస్తారన్నారు. ఈ నేపథ్యంలో సైబర్ క్రైమ్‌కు గురైన వెంటనే గోల్డెన్ అవర్‌ను వినియోగించుకోవాలంటూ బాధితులకు ఆయన కీలక సూచన చేశారు. నేరం జరిగిన గంట లోపు ఫిర్యాదు చేస్తే నగదు ఫ్రీజ్ అవుతుందన్నారు. సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930కి ఫోన్ చేసి.. ఫిర్యాదు చేస్తే సరిపోదన్నారు. అనంతరం స్థానిక పోలీసులకు సైతం ఫిర్యాదు చేయాల్సి ఉందని చెప్పారు. కానీ చాలా మందికి ఎక్కడ ఫిర్యాదు చేయాలో తెలియడం లేదన్నారు.

ఈ నూతన విధానం ద్వారా బాధితులు తమ ఫిర్యాదును పోస్ట్ ద్వారా లేదా పోలీస్ స్టేషన్లలో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్ ద్వారా పంపవచ్చన్నారు. సైబర్ మిత్ర సెల్‌లోని పోలీసులు.. బాధితులకు ఫోన్ చేసి ఫిర్యాదు ఎలా రాయాలి. ఏయే సెక్షన్లు వర్తిస్తాయనే విషయాలపై అవగాహన కల్పిస్తారు.

ఇంటి నుంచే ఎఫ్ఐ ఆర్ పొందే సౌకర్యాన్ని కల్పించడం ద్వారా 100 శాతం కేసుల నమోదును లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు.

ట్రయిల్‌లో భాగంగా 86 మందికి ఫోన్ చేశామని.. వారి నుంచి మంచి స్పందన వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ సైబర్ నేరానికి గురికాకుండా జాగ్రత్తగా ఉండాలంటూ ప్రజలకు స్పష్టం చేశారు. సైబర్ నేరాలపై తరచూ ప్రజలకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారంటూ హైదరాబాద్ పోలీసులను నగర సీపీ సజ్జనార్ ప్రశంసించారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు వెహికిల్ టు వెహికల్ (వీ2వీ) సాంకేతిక పరిజ్ఞానం

### – కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ

న్యూ డిల్లీ జనవరి 9 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );దేశంలో పెరిగిపోతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందు కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనుంది. ఈ మేరకు కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కీలక ప్రకటన చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు వెహికిల్ టు వెహికల్ (వీ2వీ) సాంకేతిక పరిజ్ఞానాన్ని తప్పనిసరి చేయనున్నట్టు తెలిపారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉ కార్లలో ఉచిత స్పెక్ట్రమ్‌ను ఉపయోగించి వెహికల్ టు వెహికల్ (ఎ2ఎ) కమ్యూనికేషన్ టెక్నాలజీని ప్రవేశపెట్టేందుకు కృషి చేస్తున్నట్లు గడ్కరీ తెలిపారు. దీని ద్వారా వాహనాలు ఒకదానికొకటి వైర్‌లెస్‌గా సమాచారం పంపుకుంటూ డ్రైవర్లను అప్రమత్తం చేస్తాయని ఆయన తెలిపారు. డ్రైవర్‌కు రియల్‌టైంలో సమీపంలోని ఇతర వాహనాలు, స్పీడు, ప్రమాదకర ప్రాంతాలు తదితర వివరాలు పంపించి, తగిన హెచ్చరికలు చేయడానికి ఉపయోగిస్తామని చెప్పారు. దీనివల్ల ప్రమాదాలు తగ్గే అవకాశముందని అభిప్రాయపడ్డారు. ఈ పరిజ్ఞానం ద్వారా రోడ్డుపై ఏదైనా వాహనం ఆగి ఉన్నప్పుడు, ముందు వెళుతున్న కారు సడన్ బ్రేక్ వేసినప్పుడు సమీపంలోని వాహనాలకు హెచ్చరికలు వెళతాయని ఉదహరించారు. ఈ ఏడాది చివరికి ఈ వైర్‌లెస్ టెక్నాలజీని అన్ని వాహనాల్లో అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు గడ్కరీ వెల్లడించారు.

## ఖమ్మం జిల్లా సస్యశ్యామలం చేయడం తన జీవిత లక్ష్యం

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 9 గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం చేయడం తన జీవిత లక్ష్యమని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. ఇవాళ (శుక్రవారం) అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో రైతు మేళా కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ యాంత్రీకరణ పథకం, ప్రకృతి వ్యవసాయ పథకాలను మంత్రులు ప్రారంభించారు. అనంతరం మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. దివంగత ఎన్టీఆర్ దీవెనలతో వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో సీతారామ ప్రాజెక్టులో డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ డీపీఆర్‌లో లేదని ప్రస్తావించారు. తమ ప్రభుత్వంలో కెనాల్స్‌కు నిధులు మంజూరు చేశామని తెలిపారు.

బీఆర్ఎస్ పాలనలో మూలన పడిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం పున:ప్రారంభోత్సవం చేశామని తెలిపారు. 350 మంది రైతులకు రూ. 1.07 కోట్లు విలువైన యాంత్రీకరణ పనిముట్లు పంపిణీ చేశామని వెల్లడించారు. జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌లో భాగంగా ప్రకృతి వ్యవసాయ పథకం ప్రారంభించినట్లు వివరించారు. వ్యవసాయ ఉద్యాన పామాయిల్ సాగుపై శాస్త్రవేత్తలు ఆదర్శ రైతులతో అవగాహన సదస్సు నిర్వహించామని పేర్కొన్నారు. నాలుగో పంప్ హౌస్ నిర్మాణంతో దమ్మ పేట, అశ్వారావుపేట మండలాలకు గోదావరి నీళ్లు వస్తాయని వెల్లడించారు. ఆయిల్ ఫామ్‌లో అంతర పంటలుగా కోకూ, జాజి, వక్క, మిరియం, సాగుతో రైతుల కు అదనపు లాభాలు వస్తాయని తెలిపారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.

దేశానికే ఆదర్శంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యవసాయ రంగంలో అగ్ర భాగాన ఉండాలని తుమ్మల చెప్పుకొచ్చారు. తెలంగాణలో పది లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు విస్తరణకు తమ ప్రభుత్వం పట్టుదలగా ఉందని పేర్కొన్నారు. సన్నకారు రైతులకు మేలు చేయాలని వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారని చెప్పుకొచ్చారు. సంక్రాంతి పండుగ రోజు నుంచి వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. 2047 నాటికి 470 బిలియన్ డాలర్స్ వ్యవసాయ రంగం వాటా ఉండేలా తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ ఉందని వెల్లడించారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల ఉత్తమ కళాశాలగా నిలవాలని సూచించారు. పామాయిల్ సాగుతో రైతులకు మహర్దశ వచ్చిందని తెలిపారు. భద్రాద్రి శ్రీ సీతారామ చంద్రస్వామి వారి ఆశీస్సులతో సీతారామ ప్రాజెక్టు పూర్తి చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## ముధోల్ అసెంబ్లీ నియోజకవర్గంలో బిజెపి తరపున గెలిచిన సర్పంచ్ అభ్యర్థుల సన్మానం



నిర్మల్ జనవరి 9 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ముధోల్ అసెంబ్లీ నియోజకవర్గం భైంసా లోని ఎస్.ఎస్. జిన్నింగ్ ఫ్యాక్టరీ లో ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పాటిల్ గారి ఆధ్వర్యంలో నిర్వహించిన "నూతనంగా గెలుపొందిన.. సర్పంచ్, ఉప-సర్పంచ్, వార్డ్ సభ్యుల - ఆత్మీయ సన్మాన సభలో మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో బీజేఎల్పీ నేత, నిర్మల్ శాసనసభ్యులు ఆలేటి మహేశ్వర్ రెడ్డి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, అదిలాబాద్ శాసనసభ్యులు పాయల్ శంకర్, అదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్, జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్న రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు నల్ల రమేష్, అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ సుమన్, పట్టణ అధ్యక్షులు రావుల రాము, మండల అధ్యక్షులు, నూతనంగా ఎన్నికైన సర్పంచ్ లు, ఉపసర్పంచ్ లు, వార్డ్ సభ్యులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఓరుగల్లు కోటలోని శిలా తోరణం అద్భుతం

### -కొనియాడిన హిమాచల్ ప్రదేశ్ విద్యాశాఖ మంత్రి రోహిత్ ఠాగూర్

వరంగల్, జనవరి 09 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): ప్రసిద్ధ కాకతీయులనాటి రాజధాని ఓరుగల్లు కోటలోని శిలా తోరణం అద్భుతమని హిమాచల్ ప్రదేశ్ విద్యా శాఖ మంత్రి రోహిత్ ఠాగూర్ కొనియాడారు. శుక్రవారం ఆయన ఓరుగల్లు కోటను సందర్శించి కాకతీయుల శిల్పకళ, వాస్తుశిల్ప నైపుణ్యాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖ గైడ్ దేనబోయిన రవి యాదవ్ కాకతీయుల చరిత్ర, వారి నిర్మాణ శైలి, కళాఖండాల విశిష్టతను వివరించారు.

ఒక్కొక్క కళాఖండాన్ని వివరిస్తూ చూపించడంతో మంత్రి ఎంతో ఆసక్తిగా తిలకించారు. శిలా తోరణం, ఖుష్ మహల్, ఏకశిలా కొండపై ఉన్న స్వయంభు ఆలయం తదితర ప్రదేశాలను సందర్శించిన మంత్రి, ప్రత్యేకంగా శిలా తోరణాన్ని చూసి అది కాకతీయ శిల్పుల గొప్పతనానికి నిదర్శనమని ప్రశంసించారు. అలాగే రాతికోటపై ఉన్న సెంట్రీ టవర్ పైకి వెళ్లి, అక్కడ నిర్మించిన మెట్ల నిర్మాణం ఎంతో అద్భు తంగా ఉందని అభినందిం చారు. కాకతీయులు చెరువులు, కోటలు, దేవాలయాల నిర్మాణంలో అపూర్వ ప్రతిభను కనబరిచారని, వారి పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపో తుందని మంత్రి రోహిత్ ఠాగూర్ అన్నారు. ఈ సందర్శనలో ఐఏఎస్ అధికారులు, వారి కుటుంబ సభ్యులు, పోలీస్ సిబ్బంది, మిల్స్ కాలనీ సబ్ ఇన్‌స్పెక్టర్ నరేష్‌తో పాటు రాష్ట్ర అధికారులు కూడా పాల్గొన్నారు. కాగా, మంత్రి తన వెంట తెచ్చుకున్న కెమెరాల్లో ఈ చారిత్రక కట్టడాలను చిత్రీకరించుకుంటూ వెళ్లారు.

# సాంప్రదాయ విజ్ఞానం నుంచి కృత్రిమ మేధ వరకు హిందీ భాష

## (జనవరి 10న "ప్రపంచ హిందీ దినోత్సవం లేదా విశ్వ హిందీ దివస్" సందర్భంగా)

మొదటి 'ప్రపంచ హిందీ సమావేశం' నాగ్‌పూర్‌లో 10 జనవరి 1975న జరిగింది. ఈ ముఖ్యమైన సంఘటనను గుర్తుచేసుకునేందుకు, భారత ప్రభుత్వం 2006 నుండి ప్రతి సంవత్సరం జనవరి 10న 'ప్రపంచ హిందీ దినోత్సవం'ను నిర్వహించాలని నిర్ణయించింది, ఇది ప్రపంచ వేదికలలో హిందీ భాషను ప్రోత్సహించడానికి, గౌరవించడానికి ఉద్దేశించబడింది. ఈ రోజు హిందీ యొక్క సాంస్కృతిక, భాషా ప్రాముఖ్యతను కూడా నొక్కి చెబుతుంది. ఇది ఇంగ్లీష్, మాండరిన్ చైనీస్ తర్వాత ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడే భాషలలో 3వది. గొప్ప సాంస్కృతిక వారసత్వం గురించి అవగాహన కల్పించడానికి, విద్య, పాలన మరియు మీడియాతో సహా వివిధ రంగాలలో దాని వాడకాన్ని ప్రోత్సహించడానికి ఈ వేదికను ఉపయోగించవచ్చు. ఈ వేడుకలు ప్రపంచవ్యాప్తంగా హిందీ మాట్లాడే సమాజాల మధ్య ఐక్యతను పెంపొందించగలవు. ప్రపంచ హిందీ దివస్-2026 యొక్క ఇతివృత్తంగా "హిందీ: సాంప్రదాయ విజ్ఞానం నుంచి కృత్రిమ మేధ వరకు" అనబడే థీమ్ ఈ డిజిటల్ యుగంలో హిందీ యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేస్తుంది, సాంకేతికత ప్రపంచ ప్రేక్షకులకు దాని పరిధిని ఎలా విస్తరించిందో చూపిస్తుంది.

### అత్యధికంగా మాట్లాడే 3వ ప్రపంచ భాష - హిందీ:

ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడే భాషలు ఇంగ్లీష్ (1,456 మిలియన్లు), మాండరిన్ చైనీస్ (1,138 మిలియన్లు), హిందీ (610 మిలియన్లు) స్పానిష్ (559 మిలియన్లు), ఫ్రెంచ్ (309 మిలియన్లు, అరబిక్ (274 మిలియన్లు), బెంగాలీ (273 మిలియన్లు) మరియు రష్యన్ (255 మిలియన్లు). ఇండో-యూరోపియన్ భాషా కుటుంబంలో ఇండో-ఆర్యన్ సమూహంలో సభ్యుడైనా హిందీ భాష. దక్షిణాఫ్రికా, మారిషస్, యెమెన్, ఫిజి, అమెరికా, ఉగాండాలో కూడా హిందీ మాట్లాడే ముఖ్యమైన సంఘాలు కనిపిస్తాయి. హిందీ భాష దేవనాగరి లిపిలో వ్రాయబడింది, సంస్కృతం ద్వారా బలంగా ప్రభావితమైంది. హిందీ భాష భారతదేశంలో అత్యధికంగా మాట్లాడే భాషగా విస్తృతంగా గుర్తించబడింది. ముఖ్యంగా ఉత్తర భారతదేశం యొక్క ప్రధాన భాషగా పరిగణించబడుతుంది. ప్రపంచంలోని దాదాపు 4.46 శాతం మంది ప్రజలు హిందీ మాట్లాడతారు. హిందీలో దాదాపు 16 మాండలికాలు, భారతదేశంలో దాదాపు 528 మిలియన్ల మంది స్థానికంగా మాట్లాడే ప్రజలు ఉన్నారు, ఇది భారతదేశ మొత్తం జనాభాలో 43 శాతం అని గమనించాలి. ప్రపంచ హిందీ దినోత్సవాన్ని నిర్వహించడంలో ప్రధాన ఉద్దేశ్యాలు ప్రపంచవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు, సాంస్కృతిక పరిరక్షణ, విద్యా ప్రోత్సాహం, అంతర్జాతీయ ఐక్యత అని తెలుసుకోవాలి. ఈ రోజు వేదికగా తీసుకోవలసిన కార్యకలాపాల్లో సాహిత్య పోటీలు, విద్యా కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, మీడియా ప్రమోషన్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. 1949లో భారతదేశ అధికారిక భాషలలో ఒకటిగా హిందీని స్వీకరించిన జ్ఞాపకార్థం ఏటా సెప్టెంబర్ 14ని "జాతీయ హిందీ దినోత్సవం"గా కూడా జరుపుకుంటామని తెలుసుకోవాలి.

- ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# అత్యుత్తమ పనితీరు కనబరిచిన జోన్లకు 26 షీల్డులను ప్రదానం చేయనున్న శ్రీ అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ, జనవరి 9:సంస్థకు చేసిన విశిష్ట సేవలు, అందించిన అద్భుత సహకారాన్ని గుర్తిస్తూ భారతీయ రైల్వే 100 మంది అంకితభావం గల ఉద్యోగులు, అధికారులను ప్రతిష్టాత్మక 70వ అతి విశిష్ట రైల్ సేవా పురస్కారం-2025తో సత్కరించనుంది. న్యూఢిల్లీలోని ద్వారకలో గల ఇండియా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ - ఎక్స్‌పో సెంటర్ (యశోభూమి)లో రేపు ఈ పురస్కార ప్రదానోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

పురస్కారానికి ఎంపికైన రైల్వే సిబ్బందికి కేంద్ర రైల్వేలు, సమాచార, ప్రసార, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికతల శాఖ మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ 70వ అతి విశిష్ట రైల్ సేవా పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో రైల్వేలు, జలశక్తి శాఖ సహాయ మంత్రి శ్రీ వి. సోమన్న... రైల్వేలు, ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీ రవ్‌నీత్ సింగ్... రైల్వే బోర్డు చైర్మన్, సీఈవో శ్రీ సతీష్ కుమార్... రైల్వే బోర్డు సభ్యులు, వివిధ రైల్వే జోన్లు, ఉత్పత్తి యూనిట్ల జనరల్ మేనేజర్లు పాల్గొంటారు.

ఆవిష్కరణలు, కార్యాచరణ సామర్థ్యం, భద్రత, రక్షణ, ఆదాయ వృద్ధి, ప్రాజెక్టులను సకాలంలో పూర్తిచేయడం, క్రీడల్లో అత్యుత్తమ ప్రదర్శన, ఇతర విశిష్ట సేవా రంగాల్లో చేసిన విస్తృత కృషికి గానూ మొత్తం 100 మంది పురస్కార గ్రహీతలు అతి విశిష్ట రైల్ సేవా పురస్కార్-2025 కోసం ఎంపికయ్యారు.

ఉత్పాదకతను మెరుగుపరచడం, పొదుపు, దిగుమతులకు ప్రత్యామ్నాయం, వనరులను మరింత సమర్థంగా ఉపయోగించడం, తద్వారా భారతీయ రైల్వేల మొత్తం సామర్థ్యాన్ని బలోపేతం చేయడం వంటి కొత్త ఆవిష్కరణలు, ప్రక్రియలు, విధానాలను ప్రవేశపెట్టిన 17 మంది అధికారులు, ఉద్యోగులను సత్కరిస్తారు.

### ధైర్యసాహసాలు, నిస్వార్థ సేవను గౌరవించడం

వ్యక్తిగత భద్రతను సైతం లెక్కచేయకుండా ప్రజల ప్రాణాలను, రైల్వే ఆస్తులను రక్షించడంలో విశేష కృషి చేసి... ప్రజా సేవ పట్ల అసాధారణ ధైర్యం, నిబద్ధత, అంకితభావాన్ని ప్రదర్శించిన 22 మంది రైల్వే ఉద్యోగులు, అధికారులను సత్కరించనున్నారు.

### ఆదాయ పెంపు, అప్రమత్తత

రైల్వే ఆదాయాలను పెంచడంతో పాటు టిక్కెట్ లేని ప్రయాణం, దొంగతనాలు, ఇతర దుష్ప్రవర్తనలను సమర్థవంతంగా పరిష్కరించడం ద్వారా ఆర్థిక క్రమశిక్షణను బలోపేతం చేయడంలో, ఆదాయాన్ని కాపాడడంలో చేసిన విశేష కృషికి గానూ 14 మంది అధికారులు, సిబ్బందికి కూడా పురస్కారాలను ప్రదానం చేస్తారు.

### అత్యుత్తమ కార్యాచరణ, ఆస్తుల రక్షణ

కార్యకలాపాలను మెరుగుపరచడం... భద్రతను, రక్షణను పెంపొందించడం... మెరుగైన నిర్వహణ పద్ధతులను నిర్ధారించడం... రైల్వే ఆస్తుల ఉత్తమ వినియోగాన్ని, భద్రతను ప్రోత్సహించడంలో ఆదర్శప్రాయమైన కృషికి గానూ 19 మంది ఉద్యోగులు, అధికారులు పురస్కారం అందుకుంటారు.

### చరిత్రాత్మక ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయడం

ముఖ్యమైన రైల్వే ప్రాజెక్టులను రికార్డు సమయంలో పూర్తి చేయడం, మౌలిక సదుపాయాల విస్తరణ, సామర్థ్యాలను మెరుగుపరచడం, మెరుగైన కార్యాచరణ పనితీరుకు గణనీయ సహకారం అందించిన 16 మంది అధికారులు, ఉద్యోగులను సత్కరిస్తారు.

### ఇతర రంగాల్లో అత్యుత్తమ ప్రదర్శన

భారతీయ రైల్వేల విభిన్న క్రియాశీల రంగాల్లో వృత్తిపరమైన నైపుణ్యం, అంకితభావం, ప్రభావవంతమైన సహకారాలను ప్రతిబింబిస్తూ... నిర్దిష్ట కేటగిరీలకు అతీతంగా ఆయా రంగాల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన 10 మంది అధికారులు, ఉద్యోగులను సత్కరిస్తారు. క్రీడారంగంలో జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు సాధించడం ద్వారా భారతీయ రైల్వేల కీర్తి ప్రతిష్టలను విశ్వవ్యాప్తం చేసిన ఇరువురు క్రీడాకారులకూ అతి విశిష్ట రైల్ సేవా పురస్కారాన్ని ప్రదానం చేస్తారు.

### వ్యక్తిగత గుర్తింపును మించి

వ్యక్తిగత పురస్కారాలతో పాటుగా వివిధ విభాగాల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన రైల్వే జోన్లకు గుర్తిస్తూ 26 షీల్డులను ప్రదానం చేస్తారు.

మహాకుంభ్ వంటి భారీ కార్యక్రమాల సమయంలో సురక్షితమైన, నిరాటంకమైన రైల్వే కార్యకలాపాలను అందించడంలో కీలక పాత్ర పోషించిన సిబ్బంది కూడా పురస్కార గ్రహీతల్లో ఉన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో క్లిష్ట పరిస్థితుల్లో నిరంతరాయం రైల్వే కార్యకలాపాలను కొనసాగిస్తూ, ప్రజలకు సహాయం అందేలా చూసిన అధికారులు, అలాగే కష్టతరమైన విభాగాల్లో అధునాతన బలాస్ట్ క్లీనింగ్ యంత్రాలను ప్రవేశపెట్టడం ద్వారా ట్రాక్ భద్రత, ప్రయాణ నాణ్యత, దీర్ఘకాలిక నిర్వహణ సామర్థ్యాన్ని గణనీయంగా మెరుగుపరిచిన వారూ ఈ పురస్కార గ్రహీతల్లో ఉన్నారు. సురక్షితమైన, మరింత సమర్థమైన, ప్రయాణికుల-కేంద్రిత మైన రైల్వే వ్యవస్థను నిర్మించడంలో దాని సిబ్బంది సమష్టి ప్రయత్నాలను గౌరవిస్తూ... వారి అంకితభావం, వృత్తి నైపుణ్యం, ఆదర్శప్రాయమైన సేవలను గుర్తించడంలో భారతీయ రైల్వేల నిబద్ధతను ఈ పురస్కార ప్రదానోత్సవం స్పష్టం చేస్తుంది.

# కొండపల్లి ప్రజదర్బార్‌లో 241 అర్జీలు

## -స్వీకరించిన మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు

ఇబ్రహీంపట్నం, జనవరి 9:: కొండపల్లి మున్సిపాలిటీ ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు ఈ రోజు ప్రజదర్బారు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు. వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. మొత్తం 241 మంది అర్జీలు సమర్పించారు. వాటిని తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ) ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# భోజన సేవల స్థాయిని పెంపొందించడంపైన ప్రత్యేక దృష్టి

న్యూఢిల్లీ, జనవరి 9:కేంద్ర రైల్వేలు, సమాచార, ప్రసార శాఖ, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికత శాఖ మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ న్యూఢిల్లీలోని రైల్వే భవన్‌లో సహాయ మంత్రులు శ్రీ వి.సోమన్న, శ్రీ రవ్‌నీత్ సింగ్‌లతో పాటు రైల్వే బోర్డు చైర్మన్, సీఈఓ శ్రీ సతీష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు.

రైల్వేల రంగంలో ఈ ఏడాది 52 సంస్కరణలను ప్రవేశపెట్టాలని సమావేశంలో నిర్ణయించారు. నూతన సంవత్సరం, కొత్త సంకల్పాలు, రైల్వేల రంగంలో విస్తృత సంస్కరణలను తీసుకురావాలన్న భావనపై సమావేశంలో ప్రధానంగా దృష్టిని కేంద్రీకరించారు.

52 వారాల్లో 52 సంస్కరణలు - పనుల్లో, పాలనలో, సేవలను అందజేయడంలో సమర్థతకు పెద్దపీట వేయాలని సంకల్పించారు.

భద్రతపై ప్రత్యేక శ్రద్ధ - 90 శాతం మేర తగ్గిన రైలు ప్రమాదాలు (వీటి సంఖ్య 2014-15లో 135గా ఉండగా, 2025-26లో 11కు పరిమితమయ్యాయి.) దీనిని ఒక అంకె స్థాయికి కుదించడం లక్ష్యం.

కృత్రిమ మేధకూ, సాంకేతికతకూ ఊతం - భద్రత, నిర్వహణ, కార్యకలాపాల్లో కృత్రిమ మేధనూ, ఉన్నత సాంకేతికతనూ ఉపయోగించుకోవడంపై దృష్టిని కేంద్రీకరిస్తారు.

ప్రతిభకు సాన, శిక్షణకు కొత్త రూపు - ఉద్యోగుల ప్రతిభకు సాన పెట్టడానికీ, నైపుణ్యాలను అభివృద్ధిపరచడానికీ కొత్త పద్ధతులను అన్వేషిస్తారు.

మెరుగైన ఆహారంతోపాటు సంబంధిత సేవలను అందజేయడం - ఆహార పదార్థాల నాణ్యతను, రైళ్లలో కేటరింగ్ సేవలను ఇప్పటి కన్నా చెప్పుకోదగ్గ స్థాయికి పెంచుతారు.

సహాయ మంత్రులు, చైర్మన్, ముఖ్య కార్యనిర్వహణ అధికారి, ఇతర ఉన్నతాధికారులు తమ క్షేత్రస్థాయి అనుభవాన్ని సమావేశంలో వివరించారు. సంస్థాగత అభివృద్ధి, నిర్వహణ అంశాలతో పాటు సామర్థ్యాన్ని పెంచే దిశగా చేపట్టాల్సిన కార్యక్రమాలను సమీక్షించారు. సంస్కరణలు, భద్రత, సాంకేతిక పురోగతి, ప్రయాణికులను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి పనులు చేపట్టే విషయాల్లో రైల్వే మంత్రిత్వ శాఖ నిబద్ధతను పునరుద్ఘాటించింది.

# రూ.15 కోట్లతో 50 పడకల ఆసుపత్రి

-పాలనాపరమైన అనుమతులు మంజూరు
-ఫలించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కృషి
-రూ.15 కోట్లతో 50 పడకల ఆసుపత్రి
-రూ.7.5 కోట్ల నిధులు విడుదల
-ఉత్తర తెలంగాణకు కీలకం కానున్న కరీంనగర్ ఆయుష్ ఆస్పత్రి

కరీంనగర్, జనవరి 9:ఉత్తర తెలంగాణ ప్రజలతోపాటు కరీంనగర్ ప్రజలకు ఇదో శుభవార్త. ఇప్పుడిప్పుడే ఆయుర్వేదం, యోగా నేచురోపతి, యునాని, సిద్ధ, హోమియోపతి వైద్యసేవలపై రోగులు దృష్టి సారిస్తున్నారు. కొన్ని రోగాలు, వ్యాధులకు సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా ఆయుర్వేదం, హోమియోపతి మందులు ఉంటున్నాయని పలువురు భావిస్తూ ఆయా వైద్య సేవల వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారు.

కరీంనగర్ లో 50 పడకల 'ఆయుష్' ఆసుపత్రి ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ 'ఆయుష్' ఆసుపత్రి ఏర్పాటు కోసం కృషి చేశారు. ఆయన కృషి ఫలించింది.

కరీంనగర్ ఆయుష్ ఆసుప్రతి ఏర్పాటుకు రూ.15 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. అందులో భాగంగా రూ.7.5 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. తక్షణమే 'ఆయుష్' ఏర్పాటు కోసం తగిన స్థలాన్ని ఎంపిక చేసి ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ పంపింది. స్థల ఎంపిక ఆయుష్ ఆసుపత్రి ఏర్పాటుతోపాటు డాక్టర్లు, సిబ్బందిని నియామక బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించింది. కేంద్రం ఆయుష్ ఆసుపత్రి ఏర్పాటుకు అనుమతి ఇవ్వడంతో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆయుష్ అధికారులతో చర్చించారు. స్థల సేకరణపై దృష్టి సారించారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం భారతీయ సంప్రదాయ వైద్య చికిత్సలకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా యోగా, ఆయుర్వేదం, హోమియోపతి వైద్యంపట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. ఈ చికిత్సలవల్ల పెద్దగా సైడ్ ఎఫెక్ట్స్ లేకపోవడంతో ప్రజలు సైతం వీటివైపు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా తెలంగాణలో ఆయుర్వేదం, హోమియోపతి, యోగా, నేచురోపతి ఆసుపత్రులకు తండోపతండాలుగా రోగులు తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో కరీంనగర్ పార్లమెంట్ ప్రజలు సైతం తమ ప్రాంతంలో ఆయుష్ ఆసుపత్రి ఉంటే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో పర్యటిస్తున్న సందర్భంలో పలుమార్లు ప్రజలు 'ఆయుష్' ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని కోరుతూ వినతి పత్రాలు అందించారు. ఈ నేపథ్యంలో బండి సంజయ్ ప్రత్యేక చొరవ తీసుకుని ఆయుష్ ఆసుపత్రి కోసం కృషి చేశారు.

# పీపీ విధానం రద్దు చేయాలి

-ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి
-ఏఐఎస్ఎఫ్, వైయస్సార్ స్టూడెంట్ యూనియన్, వైయస్సార్ యూత్

చిత్తూరు, జనవరి 9: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ బకాయిలు రూ.6,400 కోట్లు వెంటనే విడుదల చేయాలని, మెడికల్ కళాశాలల్లో అమలులో ఉన్న పీపీపీ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్, వైయస్సార్ స్టూడెంట్ యూనియన్, వైయస్సార్ యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం చిత్తూరు పట్టణంలోని పీసీఆర్ సర్కిల్ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి, వైయస్సార్ యూత్ చిత్తూరు నియోజకవర్గ అధ్యక్షుడు డీసీ మనోజ్ రెడ్డి, వైయస్సార్ స్టూడెంట్ యూనియన్ నియోజకవర్గ కార్యదర్శి సద్దాం మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. యువగళం పాదయాత్ర సందర్భంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ 100 రోజుల్లోనే విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తామని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేస్తామని, జీవో నెంబర్ 77ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థుల సమస్యలపై కనీస శ్రద్ధ కూడా చూపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వంలో ఏర్పాటైన 17 మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంతో ప్రైవేటీకరించడం అన్యాయమని వారు అన్నారు. ప్రభుత్వమే మెడికల్ కళాశాలలను నిర్వహిస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు ఉచితంగా వైద్య విద్య అందించే అవకాశం ఉంటుందని, ప్రైవేటీకరణ వల్ల సామాన్య కుటుంబాల విద్యార్థులకు మెడికల్ విద్య, వైద్యం దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల శ్రేయస్సు నిజంగా ప్రభుత్వ లక్ష్యమైతే పీపీపీ విధానాన్ని రద్దు చేసి, 17 మెడికల్ కళాశాలలను పూర్తిగా ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నడిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ చదువు తున్న విద్యార్థులకు గత రెండు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల కాక పోవడంతో ఉన్నత విద్య కొనసాగించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.

ఇన్ని విద్యారంగ సమస్యలు ఉన్నప్పటికీ వాటిని ప్రశ్నించిన విద్యార్థి, యువజన సంఘాల నాయకులపై అక్రమ కేసులు పెట్టడం, రౌడీషీట్లు ఓపెన్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు. విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న నాయకులపై కేసులు పెట్టడం సిగ్గుచేటని, వెంటనే అలాంటి కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని వారు కోరారు.

# సమస్యలకు పరిష్కారమే లక్ష్యం

-ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు
-సెంట్రల్‌లో ఎమ్మెల్యే బొండా ఉమ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్



విజయవాడ, జనవరి 9: ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని తక్షణమే పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రజా దర్బార్ నిర్విరామంగా నిర్వహిస్తున్నట్లు విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. ప్రజాదర్బార్ కార్యక్రమం ఈ రోజు సింగ్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించారు. ప్రజల నుంచి ఎమ్మెల్యే అర్జీలను స్వీకరించారు. తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజాదర్బార్ ప్రజలకు ప్రభుత్వాన్ని నేరుగా చేరువ చేసే ప్రభావవంతమైన వేదికగా మారిందన్నారు. పెన్షన్లు, ఇళ్ల స్థలాలు, వైద్య సహాయం, మౌలిక వసతులు, సచివాలయ సేవలు, రహదారులు, డ్రైనేజీలు వంటి అంశాలపై వచ్చిన అర్జీలను జవాబుదారీతనంతో పరిష్కరిస్తున్నామని తెలిపారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో గత 18 నెలల్లో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.5 కోట్లకు పైగా ఆర్థిక సహాయం అందించామని, రహదారులు, డ్రైనేజీలు, పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హాళ్ల అభివృద్ధికి రూ.300 కోట్లకు పైగా వ్యయంతో పనులు చేపట్టామని వివరించారు. సంక్షేమ పథకాల అమలుపై మాట్లాడుతూ పెన్షన్ల పెంపు, తల్లికి వందనం పథకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్న క్యాంటీన్లు, రైతులకు ఆర్థిక భరోసా వంటి పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ పథకాలపై ఇప్పటివరకు రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చు చేయగా, అందులో గత 18 నెలల్లో కేవలం పెన్షన్లకే రూ.60 వేల కోట్లకు పైగా వెచ్చించినట్టు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ఘంటా కృష్ణమోహన్, నాగవంశ రాష్ట్ర చైర్మన్ ఎరుబోతు రమణ, వెలగ సురేష్, మహిళా నాయకులు, స్వర్ణాంధ్ర ఏ2047 టీమ్ సభ్యులు, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అంకితభావంతో పనిచేద్దాం..

-అభివృద్ధిలో జిల్లాను అగ్రగామిగా నిలుపుదాం..
-పారదర్శక పాలనలో ఉద్యోగుల పాత్ర కీలకం
-జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ, జనవరి 9: ప్రజలకు పారదర్శకమైన సేవలందించడంలో ఉద్యోగుల పాత్ర కీలకమని.. అంకితభావంతో సేవలందిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలులో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో కృషిచేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.

ఏపీ ఎన్జీజీవో ఎన్టీఆర్ జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఈ రోజు కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘ ప్రతినిధులతో కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వినూత్న కార్యక్రమాలను అమలుచేస్తున్నారన్నారు. స్వర్ణాంధ్ర విజన్ ఏ 2047తో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకెళ్తోందని.. ఈ లక్ష్యాల సాధనలో ఉద్యోగులు కీలక భాగస్వాములు కావాలన్నారు. జీడీడీపీ, తలసరి ఆదాయంలో వృద్ధితో పాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు, పేదరిక నిర్మూలనకు అమలుచేస్తున్న కార్యక్రమాలు సత్ఫలితాలు ఇవ్వడంలోనూ ఉద్యోగుల సేవలు ప్రధానమని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీజీవో జిల్లా అధ్యక్షుడు డి.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం అప్పగించిన విధులను సమర్థవంతంగా అమలుచేయడంలో ఎన్టీఆర్ జిల్లా ఉద్యోగులు ఎల్లప్పుడూ ముందుంటారన్నారు. నవ్య రాజధాని అమరావతికి గేట్ వే అయిన ఎన్టీఆర్ జిల్లాలో ఉద్యోగులు పని ఒత్తిడిని అధిగమించి అభివృద్ధి, సంక్షేమ పథకాల అమల్లో ప్రత్యేక దృష్టిపెట్టి జిల్లా సమగ్రాభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తారన్నారు. కీలకమైన ఈ జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగుల పనితీరు మిగిలిన జిల్లాలకు ఆదర్శంగా ఉండేలా ప్రజలకు సేవలందిస్తామని పేర్కొన్నారు.

మెగా ఈవెంట్లను విజయవంతం చేయడంలోనూ జిల్లా కలెక్టర్ వ సారథ్యంలో సమష్టి కృషితో ముందడుగు వేస్తామని

# గణతంత్రానికి ఘన ఏర్పాట్లు

## -డీఆర్ఓకె మోహన్ కుమార్ ఆదేశాలు

చిత్తూరు,జనవరి 9: 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్ఓ కార్యాలయ సమావేశ మందిరంలో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై ఆయా శాఖల జిల్లా అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.



ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ, జనవరి 26వ తేదీన ఉదయం 9 గంటలకు నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు ఓవరాల్ ఇంచార్జ్‌గా వ్యవహరిస్తారని చెప్పారు. వేడుకలు సజావుగా సాగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

పరేడ్ కార్యక్రమానికి ఎన్సీసీ, స్కౌట్స్ విద్యార్థులను సమన్వయం చేయాలని, ప్రొటోకాల్ ఏర్పాట్లను పకడ్బందీగా అమలు చేయాలని ఆర్డీవోకు సూచించారు. జాతీయ సమైక్యతను ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రజలను ఆకట్టుకునే విధంగా కార్యక్రమాల రూపకల్పన చేయాలని ఆదేశించారు. వేడుకల సందర్భంగా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని డీఎంహెచ్ఓ కార్యాలయ ప్రతినిధికి సూచించారు. అగ్నిమాపక భద్రత చర్యలు తీసుకోవాలని, ఆయా శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలను తెలియజేసేలా శకటాల ప్రదర్శన ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

వేడుకలకు హాజరయ్యే వారికి స్నాక్స్, తాగునీరు అందించే ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ప్రధాన వేదిక వద్ద స్టేజ్ డెకరేషన్, సిట్టింగ్ ఏర్పాట్లను సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లా ప్రగతిపై సందేశాన్ని సిద్ధం చేయాలని, వివిధ శాఖల ద్వారా ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు అందించే ప్రశంసా పత్రాల వివరాలను వెంటనే కలెక్టర్ కార్యాలయానికి అందజేయాలని ఆదేశించారు.

ఆర్ అండ్ బీ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన బారికేడ్లు ఏర్పాటు చేపట్టాలని, సాంస్కృతిక కార్యక్రమాలను డీఈఓ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఈ నెల 19వ తేదీన జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై మరోసారి సమీక్ష నిర్వహించనున్నట్లు డీఆర్ఓ తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్పీ సాయినాథ్, ఆర్డీవో శ్రీనివాసులు, ఫైర్ ఆఫీసర్ పెద్దిరెడ్డి, జిల్లా పంచాయతీ శాఖ అధికారి సుధాకర్ రావు, సెరికల్చర్ జేడీ పద్మావతి, డీఈఓ రాజేంద్రప్రసాద్, సర్వ శిక్ష అభియాన్ పీడీ వెంకటరమణ, ఏవో వాసుదేవన్, అర్బన్ ఎమ్మార్వో కులశేఖర్ తదితర శాఖాధికారులు పాల్గొన్నారు.0

# సృజనాత్మక నిపుణుల కోసం వేవ్స్ బజార్ 'వార్షిక సామర్థ్య వికాస వెబినార్ కార్యక్రమం

న్యూఢిల్లీ, జనవరి 9:సమాచార-ప్రసార శాఖ పరిధిలో ప్రారంభమైన వేవ్స్ బజార్ విజయవంతమైన నేపథ్యంలో ఏడాది పొడవునా కార్యక్రమాల నిర్వహణ కూడలిగా పరిణామం చెందుతోంది. ఇందులో భాగంగా పరిశ్రమ నేతృత్వాన ప్రణాళికబద్ధంగా వెబినార్లు, మాస్టర్‌క్లాస్‌ల నిర్వహణకు శ్రీకారం చుడుతోంది. తద్వారా దేశంలోని చలనచిత్ర, సంగీత, యానిమేషన్, గేమింగ్ రంగాల్లో వృత్తిగత సామర్థ్య బలోపేతానికి అనువైన కార్యక్రమాన్ని సిద్ధం చేసింది.

దేశంలోని సృజనకర్తలు, స్టూడియోలు, అంకుర సంస్థలతోపాటు ఇప్పటికే స్థిరపడిన పరిశ్రమ నిపుణులకూ ప్రత్యక్ష సౌలభ్యం కల్పనపై ఈ కార్యక్రమం దృష్టి సారిస్తుంది... సదరు కీలక రంగాలివే:

ఆన్‌లైన్ ద్వారా ప్రత్యక్ష విధానంలో నిర్వహించే ఈ కార్యక్రమాల్లో ప్రత్యేక ప్రశ్నోత్తర విభాగాలు ఉంటాయి. తద్వారా వాస్తవ ప్రపంచ విజ్ఞాన ఆదానప్రదానాల సౌలభ్యం దిశగా స్వతంత్ర వృత్తిదారులతో పారిశ్రామికవేత్తలు, నిపుణులు నేరుగా సంభాషణల్లో పాల్గొనగలుగుతారు.

ఈ ప్రక్రియను ఏడాది పొడవునా కొనసాగించే వేదికగా రూపొందించడం కోసం పరిశ్రమ నేతృత్వాన ప్రణాళికబద్ధ 'వెబినార్లు, మాస్టర్‌క్లాస్‌'లను వేవ్స్ బజార్ సంవత్సరమంతా నిర్వహిస్తుంది. దేశీయ చలనచిత్ర, సంగీత, యానిమేషన్, గేమింగ్ రంగాలలో వృత్తిగత సామర్థ్య వికాసం దీని లక్ష్యం. అలాగే విజ్ఞాన వృద్ధి, ప్రపంచ మార్కెట్ సంసిద్ధత సహా ఇప్పటికే స్థిరపడిన పరిశ్రమ నిపుణులతో ప్రత్యక్ష సంభాషణ ద్వారా ఆయా రంగాల నిర్దిష్ట అవగాహన సౌలభ్యం కల్పిస్తుంది.

సృజనాత్మక వ్యవస్థాపన, ప్రపంచ భాగస్వామ్యం, సృజనావరణ వ్యవస్థకు రూపకల్పనపై వేవ్స్ బజార్ విస్తృత కర్తవ్యంలో ఈ వెబినార్ కార్యక్రమం ఒక భాగంగా ఉంటుంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు తమతమ సెషన్లను విజయవంతంగా పూర్తి చేశాక వేవ్స్ బజార్ ద్వారా 'పార్టిసిపేషన్ సర్టిఫికేట్' ప్రదానం చేస్తారు. వేవ్స్ బజార్ ఈ నెలలో ప్రపంచ మార్కెట్ సౌలభ్యం, సృజనాత్మక రంగంలో మేధా సంపత్తిపై దృష్టి సారించే రెండు ధ్రువీకృత పరిశ్రమ-నేతృత్వ వెబినార్లను నిర్వహిస్తుంది.

# యూనివర్సిటీలలో సంక్రాంతి సంబరాలు

## -సంక్రాంతి సంబరాల్లో సిబ్బంది, విద్యార్థులతో కలిసి
## -పాల్గొన్న మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి



మేడ్చల్, జనవరి 9: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో భాగంగా శుక్రవారం సీఎంఆర్ యూనివర్సిటీలలో మైసమ్మగూడ, కండ్లకోయ వివిధ బ్రాంచీలలో మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి ఆధ్వర్యంలో యూనివర్సిటీలలోని సిబ్బంది, విద్యార్థులతో కలిసి భోగి పండుగ, భోగి మంటలు, ముగ్గుల పోటీలు, నిర్వహించారు. పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. విద్యార్థులతో కలిసి చామకూర మల్లారెడ్డి డ్యాన్స్ ప్రోగ్రామ్లో పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు. సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు.

# ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలి

## -డీఎంహెచ్‌వో
## ప్రభుత్వ ఆసుపత్రిలోనే బర్త్ ప్లానింగ్-డా. ప్రమోద్ కుమార్

కరీంనగర్, జనవరి 9: పెద్దపల్లి జిల్లా రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో



ప్రసవాల సంఖ్యను గణనీయంగా పెంచేందుకు క్షేత్రస్థాయిలో సమర్థవంతమైన ప్రణాళికతో పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. కె. ప్రమోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఇవాళ రామగుండంలోని సిమ్స్ ప్రభుత్వ మెడికల్ కళాశాల సమావేశ మందిరంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంతర్గాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన వైద్య అధికారులు, సూపర్ వైజర్లు, ఏఎన్ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి గైనకాలజీ విభాగాధిపతులతో కన్వర్జెన్సీ సమావేశం కూడా నిర్వహించారు.

ఈ సందర్భంగా డా.ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో నెలలు నిండిన గర్భిణీలను నిరంతరం ట్రాకింగ్ చేయాలని, బర్త్ ప్లానింగ్ మొత్తం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, రామగుండంలోనే జరిగేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రసవాలు నిర్వహించడంలో నిష్ణాతులైన గైనకాలజిస్టులు, నర్సింగ్ సిబ్బంది ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నారని తెలిపారు. అలాగే ఉచితంగా టిఫ్ఫా స్కానింగ్ వంటి సౌకర్యాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ఆశా కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని తమ పరిధిలోని గర్భిణీలను ప్రసవాల కోసం తప్పనిసరిగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, రామగుండానికి తీసుకురావాలని ఆదేశించారు.

అసంక్రమిత వ్యాధుల (ఎన్‌సీడీ) స్క్రీనింగ్‌లో నెలకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలని తెలిపారు. మెడికల్ ఆఫీసర్లు వారానికి కనీసం 20 కేసులు, ఎంఎల్‌హెచ్‌పీలు వారానికి 50 కేసులు క్రాస్ వెరిఫికేషన్ చేయాలని సూచించారు. ప్రతి మధుమేహం, రక్తపోటు కేసును ఎన్‌సీడీ పోర్టల్‌లో వైద్య అధికారి లాగిన్ ద్వారా నమోదు చేయాలని స్పష్టం చేశారు. ప్రతి క్యాన్సర్ కేసును తప్పనిసరిగా స్క్రీనింగ్ చేయాలని, రిఫరల్ కేసులను మెడికల్ ఆఫీసర్లు పర్యవేక్షించాలని తెలిపారు. రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో డేకేర్ క్యాన్సర్ కీమోథెరపీ సేవలు అందుబాటులో ఉన్నాయని, వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు.

వందశాతం వ్యాక్సినేషన్ సాధించడంతో పాటు డ్రాప్‌అవుట్ కేసులు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఓపీ సంఖ్యను పెంచాలని, సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం అధికారులు డా.రాజమౌళి, డా.వి. వాణిశ్రీ, డా.బి.శ్రీరాములు, డా.బి.కిరణ్, డా.అరుణ (ఓబీజీవై ప్రొఫెసర్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్), డా.శ్రీదేవి పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులు, సూపర్ వైజర్లు, ఏఎన్ఎంలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# భారత ఇంధన వారోత్సవం- 2026: ఈ యేడు అంతర్జాతీయ ఇంధన కార్యాచరణకు నిర్దేశం

న్యూఢిల్లీ, జనవరి 9:గోవా వేదికగా జనవరి 27 నుంచి 30 వరకు భారత ఇంధన వారోత్సవం (ఐఈడబ్ల్యూ) - 2026 జరగబోతోంది. 120కి పైగా దేశాల నుంచి దాదాపు 75,000 మంది ఇంధన రంగ నిపుణులు, 700కు పైగా ప్రదర్శన కంపెనీలు, 6,500 మందికి పైగా ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొనున్నారు. ఈ సంవత్సరంలో మొదటి ప్రధాన అంతర్జాతీయ ఇంధన సమావేశం ఇది. విధాన నిర్ణయాలు, మార్కెట్లు, సాంకేతికత, పెట్టుబడుల్లో భాగస్వామ్యం కోసం ఓ సమగ్ర వేదికగా ఈ వారోత్సవం నిలుస్తుంది. తద్వారా ఇంధన పరంగా ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లకు పరిష్కారాలను అందించడంతోపాటు సుస్థిర భవిత దిశగా ఆచరణీయ మార్గాలను అన్వేషిస్తుంది.

భారీ స్థాయి ప్రదర్శన, ఉన్నత స్థాయి సదస్సు, ప్రపంచ దేశాల నేతల భాగస్వామ్యం, ప్రత్యేక ఇతివృత్తాలతో ప్రదర్శనలతో ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారు. విధానాలను ఆచరణాత్మక ఫలితాలుగా మార్చడమే లక్ష్యంగా ఈ వారోత్సవాన్ని ప్రభుత్వం నిర్వహించబోతోంది.

భారత ఇంధన వారోత్సవం-2026లో అత్యంత ముఖ్యమైన అంశం ఈ ప్రదర్శన. ఇంధన రంగ కార్యకలాపాల్లోని ప్రతి దశకూ చెందిన 700కు పైగా దేశీయ, అంతర్జాతీయ కంపెనీలను ఈ ప్రదర్శన ఒక్కచోట చేరుస్తుంది. హైడ్రోకార్బన్లు, పునరుత్పాదక ఇంధనాలు, హైడ్రోజన్, జీవ ఇంధనాలు, ఎల్ఎన్‌జీ, పెట్రోకెమికల్స్, డిజిటలైజేషన్, తదుపరితరం ఇంధన వ్యవస్థలకు సంబంధించి అత్యాధునిక సాంకేతికతలు, మార్గాలకు అంతర్జాతీయ వేదికగా ఈ ప్రదర్శన నిలవనుంది.

పారిశ్రామిక దిగ్గజాలు, విధాన నిర్ణేతలు, పెట్టుబడిదారులు, తుది వినియోగదారుల మధ్య నేరుగా అనుసంధానానికి అవకాశం కల్పించడం ద్వారా.. నూతన భాగస్వామ్యాలను ప్రోత్సహించడంలోనూ, వాణిజ్యపరమైన ఫలితాలను వేగవంతం చేయడంలోనూ ఈ ప్రదర్శన కీలక పాత్ర పోషించనుంది. పెట్టుబడులతో ఇంధన రంగంలో పరివర్తనకూ ఉపయోగపడుతుంది.

ప్రదర్శనకు అనుబంధంగా భారత ఇంధన వారోత్సవం- 2026లో సదస్సును నిర్వహిస్తున్నారు. వారం పాటు జరిగే వ్యూహాత్మక, సాంకేతిక చర్చలకు ఈ సదస్సు వేదికగా నిలుస్తుంది. విధానపరమైన లక్ష్యాలకూ, వాటి వాస్తవిక అమలుకూ మధ్య సమన్వయమే దీని లక్ష్యం.

వ్యూహాత్మక సదస్సు 65కు పైగా ఉన్నత స్థాయి సెషన్ల ద్వారా 300 మందికి పైగా సీనియర్ వక్తలను ఒకచోట చేర్చనుంది. ఇందులో మంత్రులు, విధాన నిర్ణేతలు, సీఈఓలు, వివిధ సంస్థల అధినేతలు పాల్గొని.. ఇంధన భద్రత, సరఫరా వ్యవస్థ బలోపేతం, పెట్టుబడుల సమీకరణ, విద్యుదీకరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, అంతర్జాతీయ సహకారం వంటి ప్రధానమైన అంశాలపై చర్చిస్తారు.

సాంకేతిక సదస్సు ఈ చర్చలను మరింత ముందుకు తీసుకెళ్లనుంది. 45కు పైగా ప్రత్యేక సెషన్లలో 250 మందికి పైగా నిపుణులు ప్రసంగిస్తారు. ఇంధన పరివర్తన ప్రక్రియను వేగవంతం చేస్తున్న నవ సాంకేతికతలు, వినూత్న మార్గాలు, అత్యుత్తమ పద్ధతులపై లోతైన విశ్లేషణలను వీరు అందిస్తారు.

### విలక్షణమైన అంతర్జాతీయ నాయకత్వం, ఇంధన దౌత్యం

ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల ప్రభుత్వాల సీనియర్ మంత్రులు, అంతర్జాతీయ సంస్థల అధిపతులు, ప్రముఖ అంతర్జాతీయ ఇంధన కంపెనీల సీఈవోల భాగస్వామ్యం.. భారత ఇంధన వారోత్సవం- 2026లోని ముఖ్యమైన అంశం. అమెరికా, ఐరోపా, మధ్య ప్రాచ్యం, ఆఫ్రికా, ఆసియా-పసిఫిక్ ప్రాంతాల నుంచి ప్రతినిధుల భాగస్వామ్యంతో.. అంతర్జాతీయ ఇంధన దౌత్యానికీ, అగ్రశ్రేణి నాయకత్వ స్థాయి చర్చలకు కీలక వేదికగా 'భారత ఇంధన వారోత్సవం-2026' స్థానం మరింత సుస్థిరం కాబోతోంది.

ప్రత్యేక ఇతివృత్తాలు: ఇంధన భవిత దిశగా నిర్దేశిత మార్గాలు

11 ప్రత్యేక ఇతివృత్తాలతో కూడిన జోన్లుగా ఈ ప్రదర్శనను విభజించారు. అంతర్జాతీయ ఇంధన వ్యవస్థకు కీలక ప్రాతిపదికలైన ఒక్కో అంశాన్నీ ప్రతిబింబించేలా వీటిని తీర్చిదిద్దారు. అణు శక్తి, పర్యావరణ హిత విమానయాన ఇంధనం, హైడ్రోజన్, పునరుత్పాదక ఇంధనం, జీవ ఇంధనాలు, ఎల్ఎన్‌జీ, పెట్రోకెమికల్స్, సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్, డిజిటలీకరణ - ఏఐ, మేకిన్ ఇండియా - ఉద్గార రాహిత్యం వంటి అంశాలు ఇందులో ఉన్నాయి. ప్రముఖ పరిశ్రమల భాగస్వామ్యంతో రూపొందించిన ఈ జోన్లు.. సాంకేతిక ప్రదర్శనలకు, నూతన భాగస్వామ్యాల ఏర్పాటుకు, కొత్త మార్గాలను అన్వేషించేలా చర్చలకు అనువైన వాతావరణాన్ని నెలకొల్పుతాయి.

### సహకారం కోసం అంతర్జాతీయ అనుసంధానమున్న వేదిక

కేంద్ర పెట్రోలియం, సహజవాయు మంత్రిత్వ శాఖ సౌజన్యంతో.. భారత పెట్రోలియం పరిశ్రమల సమాఖ్య (ఎఫ్ఐపీఐ), డీఎంజీ ఈవెంట్స్ సంయుక్తంగా 'భారత ఇంధన వారోత్సవం-2026'ను నిర్వహిస్తున్నాయి. ఇంధన భద్రత, అందుబాటు ధరలు, సుస్థిరత వంటి అంశాల్లో పురోగతి దిశగా.. అంతర్జాతీయ స్థాయి అనుసంధాన వేదికగా ఈ కార్యక్రమం నిలుస్తుంది. ఇంధన రంగానికి చెందిన అన్ని వర్గాల ప్రతినిధులను ఒక్కచోట చేర్చడం ద్వారా.. ఈ ఏడాదికి అంతర్జాతీయ ఇంధన కార్యాచరణను తీర్చిదిద్దడంలో 'భారత ఇంధన వారోత్సవం- 2026' కీలకపాత్ర పోషించబోతోంది.

# జనవరి 11 వరకు "సోమనాథ్ స్వాభిమాన్ పర్వం"

న్యూఢిల్లీ, జనవరి 9:జనవరి 8 నుంచి 11 వరకు నిర్వహిస్తున్న "సోమనాథ్ స్వాభిమాన్ పర్వం'లో పాల్గొనాలని దేశ ప్రజలకు కేంద్ర హోం, సహకార మంత్రి శ్రీ అమిత్ షా విజ్ఞప్తి చేశారు.

సోమనాథ్ ఆలయంపై దాడి జరిగి వెయ్యేళ్లు పూర్తయిన నేపథ్యంలో సోమనాథ్ స్వాభిమాన్ పర్వాన్ని నిర్వహించాలని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నిర్ణయించారని కేంద్ర హోం, సహకార మంత్రి తెలియజేశారు. సనాతన సంస్కృతి శాశ్వతత్వాన్ని, పునరుజ్జీవన శక్తిని భవిష్యత్తు తరాలకు ఒక సందేశంగా ఈ ఉత్సవం నిలుస్తుందన్నారు.

"జ్యోతిర్లింగాల్లో ఒకటిగా మాత్రమే కాకుండా, చెక్కుచెదరని సనాతన సంస్కృతికి, ఆధ్యాత్మిక స్ఫూర్తికి సోమనాథ్ మహాదేవ్ ఆలయం ప్రతీక. గడచిన వెయ్యేళ్లలో ఈ ఆలయం అనేక దాడులను ఎదుర్కొంది. అయినప్పటికీ.. ప్రతిసారి పునరుజ్జీవనం పొందింది.

ఇది మన నాగరికత శాశ్వతత్వాన్ని, ఎన్నటికీ ఓటమిని అంగీకరించని దృఢ సంకల్పాన్ని సూచిస్తుంది. దీనిని నాశనం చేయాలని ప్రయత్నించినవారంతా తుడిచిపెట్టుకుపోయారు. కానీ ఈ ఆలయం మాత్రం ఇప్పటికీ గొప్ప వైభవంతో అలరారుతోంది. ఇలాంటి దాడులు మనకు నష్టాన్ని కలిగించవచ్చేమో కానీ మనల్ని నాశనం చేయలేవనే విషయాన్ని సోమనాథ్ ఆలయ చరిత్ర చెబుతోంది. ఎందుకంటే.. ప్రతిసారి మరింత వైభవం, దైవత్వంతో పుంజుకోవడం సనాతన సంస్కృతికి ఉన్న సహజ లక్షణం. సోమనాథ్ ఆలయంపై మొదటిసారి దాడి జరిగి వెయ్యేళ్లు పూర్తయిన సందర్భంగా సోమనాథ్ స్వాభిమాన్ పర్వాన్ని నిర్వహించాలని ప్రధానమంత్రి శ్రీ మోదీ నిర్ణయించారు.

# ఓరుగల్లు కోట శిలా తోరణం అద్భుతం..హిమాచల్ ప్రదేశ్ మంత్రి రోహిత్ ఠాగూర్ ప్రశంసలు



వరంగల్, జనవరి 09 : ప్రసిద్ధ కాకతీయులనాటి రాజధాని ఓరుగల్లు కోటలోని శిలా తోరణం అద్భుతమని హిమాచల్ ప్రదేశ్ విద్యాశాఖ మంత్రి రోహిత్ ఠాగూర్‌కొనియాడారు.

శుక్రవారం ఆయన ఓరుగల్లు కోటను సందర్శించి కాకతీయుల శిల్పకళ, వాస్తుశిల్ప నైపుణ్యాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖ గైడ్ దేనబోయిన రవి యాదవ్ కాకతీయుల చరిత్ర, వారి నిర్మాణ శైలి, కళాఖండాల విశిష్టతను వివరించారు. ఒక్కొక్క కళాఖండాన్ని వివరిస్తూ చూపించడంతో మంత్రి ఎంతో ఆసక్తిగా తిలకించారు. శిలా తోరణం, ఖుష్ మహల్, ఏకశిలా కొండపై ఉన్న స్వయంభు ఆలయం తదితర ప్రదేశాలను సందర్శించిన మంత్రి, ప్రత్యేకంగా శిలా తోరణాన్ని చూసి అది కాకతీయ శిల్పుల గొప్పతనానికి నిదర్శనమని ప్రశంసించారు. అలాగే రాతికోటపై ఉన్న సెంట్రీ టవర్ పైకి వెళ్లి, అక్కడ నిర్మించిన మెట్ల నిర్మాణం ఎంతో అద్భుతంగా ఉందని అభినందించారు.

కాకతీయులు చెరువులు, కోటలు, దేవాలయాల నిర్మాణంలో అపూర్వ ప్రతిభను కనబరిచారని, వారి పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని మంత్రి రోహిత్ ఠాగూర్ అన్నారు.

ఈ సందర్శనలో ఐఏఎస్ అధికారులు, వారి కుటుంబ సభ్యులు, పోలీస్ సిబ్బంది, మిల్స్ కాలనీ సబ్ ఇన్స్పెక్టర్ నరేష్‌తో పాటు రాష్ట్ర అధికారులు కూడా పాల్గొన్నారు. కాగా, మంత్రి తన వెంట తెచ్చుకున్న కెమెరాల్లో ఈ చారిత్రక కట్టడాలను చిత్రీకరించుకుంటూ వెళ్లారు.

# ప్రజా సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలి : కలెక్టర్ హనుమంతరావు

## - బీబీనగర్‌లో క్షేత్రస్థాయి తనిఖీలు

నల్గొండ, జనవరి 9:భూభారతి పెండింగ్ దరఖాస్తులు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని యాదాద్రి భువనగిరి కలెక్టర్ హనుమంత రావు అన్నారు. శుక్రవారం బీబీనగర్ మండల కేంద్రంలోని పిహెచ్‌సి, తాసీల్దార్ కార్యాలయంలో భూభారతి పెండింగ్ దరఖాస్తులపై అధికారులతో సమీక్ష, జైనపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. ముందుగా బీబీనగర్ తాసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి కింద గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చొరవ చూపాలని, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలు, సాదాబైనామా పెండింగ్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని సూచించారు. అర్జీలను తిరస్కరించాల్సి వస్తే అందుకు గల కారణాలను స్పష్టంగా నమోదు చేయాలని, చిన్నచిన్న సాంకేతిక కారణాలతో దరఖాస్తులను తిరస్కరించవద్దన్నారు. ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా పూర్తి పారదర్శకతతో, భూభారతి చట్ట నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. తదుపరి సమీక్ష నాటికి స్పష్టమైన ప్రగతి కనిపించాలని పేర్కొన్నారు.

అనంతరం జైనపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలన్నారు. ఇండ్ల నిర్మాణం పూర్తయిన వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ అవుతాయని తెలిపారు. రెండో విడతలో కూడా ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని, ఇప్పటికే మంజూరైన ఇండ్ల పనులు త్వరగా పూర్తిచేస్తే కొత్త ఇండ్ల మంజూరుకు అవకాశం ఉంటుందని వివరించారు.

అదేవిధంగా బీబీనగర్ పట్టణ కేంద్రంలోని పిహెచ్‌సిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అటెండెన్స్? రిజిస్టర్‌ను పరిశీలించి వైద్యులు, సిబ్బంది హాజరు వివరాలు తెలుసుకున్నారు. రోజువారీ రోగుల సంఖ్య, ఇన్ పేషెంట్ల వివరాలు, ఔషధాల లభ్యతపై ఆరా తీశారు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, డీడీఎల్ రిజిస్టర్‌ను ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే అసంపూర్తిగా ఉన్న ఫ్లోర్‌ను శుభ్రం చేయాలని, బిల్డింగ్‌కు మెట్లు, కాంపౌండ్ వాల్ పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

# ఆధార్‌కు కొత్త ముఖచిత్రం: ఉదయ్ పేరుతో మస్కట్‌ను ఆవిష్కరించిన యూఐడీఏఐ

న్యూఢిల్లీ, జనవరి 9:ఉదయ్ పేరుతో ఆధార్ మస్కట్‌ను యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) ఇవాళ ప్రారంభించింది. ఆధార్ సేవలను ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా వివరించే స్నేహపూర్వక సమాచార చిహ్నంగా మస్కట్‌ను రూపొందించారు. ఆధార్ సంబంధిత సమాచారాన్ని ప్రజలకు చేరవేసేందుకు, సులభంగా అర్థమయ్యేలా చేయటానికి ఈ ఉదయ్ మస్కట్ ఉపయోగపడుతుంది. ఇది ఆధార్ సేవలను మరింత సులభతరం చేస్తుంది. నవీకరణ, ధ్రువీకరణ, ఆఫ్ లైన్ వెరిఫికేషన్, ప్రత్యేక సమాచార మార్పిడి, నూతన సాంకేతికతను అలవాటు చేసుకోవటం, బాధ్యతయుతమైన వినియోగాన్ని మస్కట్ వివరిస్తుంది.

ఈ విజన్‌ను సాకారం చేసేందుకు అందరినీ భాగస్వాములను చేయాలని యూఐడీఏఐ బహిరంగ మార్గాన్ని ఎంచుకుని, డిజైన్, పేరును ఎంపిక చేసేందుకు మైగవ్ వేదిక ద్వారా జాతీయస్థాయి పోటీని నిర్వహించింది. దీనికి అనూహ్యమైన స్పందన లభించింది. దేశవ్యాప్తంగా విద్యార్థులు, నిపుణులు, డిజైనర్ల నుంచి మొత్తం 875 ప్రతిపాదనలు వచ్చాయి. వాటిలో ప్రతీదీ ఆధార్‌ను వినూత్న రీతిలో వివరించింది. ఈ ఎంపిక ప్రక్రియలో పారదర్శకతను, కచ్చితత్వాన్ని పాటించటానికి వివిధ స్థాయిల్లో మూల్యాంకనం జరిగింది. ఈ ప్రక్రియ ద్వారా అద్భుతమైన సృష్టి ఆవిష్కృతమైంది. ప్రజల అంచనాలకు రూపమిస్తూ, సంస్థాగత ప్రాధాన్యతతో దీన్ని రూపుదిద్దారు.

మస్కట్ డిజైన్ పోటీలో కేరళలోని త్రిస్సూర్‌కు చెందిన గోకుల్ మొదటి బహుమతిని గెలుచుకున్నారు. మహారాష్ట్రలోని పూణెకు చెందిన ఇద్రిస్ దవైవాలా, ఉత్తం ప్రదేశ్‌లోని ఘాజీపూర్‌కు చెందిన కృష్ణ శర్మ వరుసగా రెండవ, మూడవ బహుమతులను గెలుచుకున్నారు.

మస్కట్ పేరు ఎంపిక పోటీలో భోపాల్‌కు చెందిన రియా జైన్ ప్రథమ బహుమతి గెలుచుకోగా.. పూణెకు చెందిన ఇద్రిస్ దవైవాలా, హైదరాబాద్‌కు చెందిన మహరాజ్ శరణ్ చెల్లపిల్ల వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

తిరువనంతపురంలో జరిగిన కార్యక్రమంలో యూఐడీఏఐ ఛైర్మన్ నీల్‌కాంత్ మిశ్రా ఆధార్ మస్కట్‌ను ఆవిష్కరించి, విజేతలను సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. దేశంలోని వంద కోట్లకు పైగా ప్రజలకు ఆధార్ సమాచారాన్ని సరళంగా, అందరికీ అర్థమయ్యేలా, స్నేహపూర్వకంగా చేరవేయటానికి యూఐడీఏఐ నిరంతరం చేస్తున్న కృషిలో భాగంగా మస్కట్ ఆవిష్కరణ కీలక ముందడుగని తెలిపారు.

బహిరంగ జాతీయ స్థాయి పోటీ ద్వారా మస్కట్ డిజైన్, పేరు పెట్టాలని ప్రజలను ఆహ్వానించటం ద్వారా 'ఆధార్ ముఖ్య సూత్రం: ప్రజల భాగస్వామ్యంతో విశ్వాసం, ఆమోదం లభిస్తాయి' అని యూఐడీఏఐ మరోసారి స్పష్టం చేసిందని, యూఐడీఏఐ సీఈఓ భువనేశ్ కుమార్ అన్నారు. ప్రజాప్రయోజనకర వ్యవస్థగా ఆధార్‌ను ప్రజలు ఎంతగా ఆదరిస్తున్నారో ఈ పోటీకి లభించిన అనూహ్య స్పందన ద్వారా తెలుస్తుందని చెప్పారు.

ఈ మస్కట్ ఒక మిత్రుడిగా, వ్యాఖ్యాతగా తన ప్రయాణాన్ని ప్రారంభిస్తోందని, ఆధార్ సంబంధిత సమాచారాన్ని ప్రజలు సులభంగా అర్థం చేసుకోవటానికి ఇది దోహదపడుతుందని యూఐడీఏఐ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వివేక్ సి వర్మ తెలిపారు.

# జమ్మూకాశ్మీర్ భద్రతపై కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా అధ్యక్షతన సమీక్ష

న్యూఢిల్లీ, జనవరి 9: జమ్మూకాశ్మీర్ భద్రతపై కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా అధ్యక్షతన నేడు న్యూఢిల్లీలో సమీక్ష జరిగింది. ఈ సమావేశంలో జమ్మూకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీ మనోజ్ సిన్హా, కేంద్ర హోం శాఖ కార్యదర్శి, ఐబీ డైరెక్టర్, జమ్మూకాశ్మీర్ ప్రదాన కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ పోలీస్, సీఆపీఎఫ్ అధిపతులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జమ్మూకాశ్మీర్‌లో శాశ్వత శాంతిని నెలకొల్పడానికి, ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించడానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా అన్నారు. ఉగ్రవాదాన్ని సహించేది లేదని, దానికి వ్యతిరేకంగా కఠిన చర్యలు కొనసాగిస్తామని వెల్లడించారు. మోదీ ప్రభుత్వం చేపట్టిన నిరంతర, సమన్వయ ప్రయత్నాల ఫలితంగా జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాద వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిందని శ్రీ షా అన్నారు. జమ్మూకాశ్మీర్‌లో భద్రతా పరిస్థితులను మరింత బలోపేతం చేయడంలో భద్రతా సంస్థలు చేస్తున్న కృషిని కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా ప్రశంసించారు. ఉగ్రవాద మౌలిక సదుపాయాలు, ఉగ్రవాద నిధుల సమీకరణను లక్ష్యంగా చేసుకున్న ఉగ్రవాద వ్యతిరేక (సీటీ) కార్యకలాపాలు అత్యంత ప్రాధాన్యతతో నిరంతరాయంగా కొనసాగించాలని ఆయన పేర్కొన్నారు.

# 'చేనేత రుణమాఫీ నిధులు వెంటనే బ్యాంకుల్లో జమ చేయాలి'

## రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు




నల్గొండ, జనవరి 9:చేనేత రుణమాఫీ నిధులను ప్రభుత్వం వెంటనే బ్యాంకుల్లో జమ చేయాలని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ డా.వకుళాభరణం కృష్ణమోహన్ రావు డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలో చేనేత రుణమాఫీ, చేనేత సమస్యలపై బిజెపి చేనేత సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం రెండు రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చేనేత వర్గాలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయకపోవడాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. చేనేత వర్గ ప్రజలను పట్టించుకోకపోవడం పాలనలో బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. చేనేత రుణమాఫీ చేస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తూ కార్మికులను మోసం చేస్తుందని దుయ్యబట్టారు. అగ్గిపెట్టెలో ఆమర్చగలిగిన చీరలను రూపొందించే అసాధారణ నైపుణ్యం కలిగిన చేనేత కళాకారులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ వంటి మహనీయుల కృషి వల్లే ఈ స్థాయిలోనైనా పథకాలు కొనసాగుతున్నాయన్నారు. మహాత్మా గాంధీ వారసులమని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ, గాంధీజీతో అనుబంధం ఉన్న చేనేత వర్గాలను విస్మరించడం దురదృష్టకరం అన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ రాట్నం వడకడాన్ని ఫ్యాషన్‌గా మార్చి, ర్యాలీలు, ఫొటోలకే పరిమితం అవుతోందని ఆయన ఎద్దేవా చేశారు.

చేనేత భరోసా కింద రూ.24 వేలు, థ్రిఫ్ట్ నిధుల పరిస్థితి ఏమిటో ప్రభుత్వం స్పష్టంగా చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. చేనేత వస్త్రాలను ప్రభుత్వం నేరుగా కొనుగోలు చేయాలని, ఈ వర్గాలకు జీవన భరోసా కల్పించాలని కోరారు. సహకార సంఘాల ఎన్నికలను వెంటనే నిర్వహించాలన్నారు. అనంతరం దీక్షలో పాల్గొన్న ప్రతినిధులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత జన సమాఖ్య అధ్యక్షుడు చింతకింది రమేశ్, జిల్లా చేనేత సెల్ అధ్యక్షుడు గంజి బసవలింగం, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, పట్టణ అధ్యక్షుడు డబ్బికార్ సహేష్, మాజీ అధ్యక్షుడు రచ్చ సత్యనారాయణ, నేతలు బారత బాలరాజ్, ఏలే శ్రీనివాస్, భారత భూషణ్, చెరుకూరి వెంకటేశం, గంజి సుదర్శన్, వరకాల వెంకటేశం, బి.రఘు, మేకల చొక్కారెడ్డి, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

# గణతంత్ర దినోత్సవాలు-2026: వీర్ గాథ 5.0లో రికార్డు స్థాయిలో పాల్గొన్న 1.92 కోట్ల మంది విద్యార్థులు

న్యూఢిల్లీ, జనవరి 9:గణతంత్ర దినోత్సవాల్లో భాగంగా రక్షణ మంత్రిత్వ శాఖ, విద్యా మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహించిన ప్రాజెక్ట్ వీర గాథ 5.0కు విశేష స్పందన లభించింది. ఈ ఏడాది దాదాపు 1.90 లక్షల పాఠశాలల నుంచి సుమారుగా 1.92 కోట్ల మంది విద్యార్థులు పాల్గొన్నారు. 2021లో ప్రారంభమైన నాటి నుంచి ఈ ఏడాది అత్యధిక సంఖ్యలో విద్యార్థులు ఈ కార్యక్రమంలో భాగం పంచుకున్నారు. జాతీయ స్థాయిలో 100 మంది విజేతలుగా ఎంపికయ్యారు. ప్రాథమిక దశ (3 నుంచి 5 గ్రేడ్లు) నుంచి 25 మంది, మాధ్యమిక దశ (6 నుంచి 8 గ్రేడ్లు) నుంచి 25 మంది, సెకండరీ స్థాయి (9 నుంచి 10, 11 నుంచి 12 గ్రేడ్ల వరకు సమాన ప్రాతినిధ్యం) నుంచి 50 మంది విజేతలుగా నిలిచారు. సూపర్-100 విజేతల వివరాలు దిగువ లింక్‌లో ఉన్నాయి.

విద్యార్థుల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు వినూత్న కార్యక్రమాలను వీర్ గాథ 5.0 ప్రారంభించింది. ఈ కార్యక్రమం 2025 సెప్టెంబర్ 8న ప్రారంభమైంది. వీడియోగ్రఫీ, యాంకరింగ్, రిపోర్టింగ్, స్టోరీ టెల్లింగ్ విభాగాల్లో మొదటిసారి షార్ట్-వీడియో విధానాన్ని ప్రవేశపెట్టారు. ఇది భారతీయ సైనిక సంప్రదాయాలు, వ్యూహాలు, కార్యక్రమాలు, వీరోచిత గాథలతో సహా సమర పరంపరకు సంబంధించిన వీడియోలను రూపొందించేలా విద్యార్థులను ప్రోత్సహించింది.

కళింగ రాజు ఖారవేల, పృథ్వీ రాజ్ చౌహాన్, ఛత్రపతి శివాజీ మహారాజ్, 1857 యుద్ధ వీరులు, గిరిజన తిరుగుబాటు వీరులతో సహా దేశంలోని గొప్ప యోధుల అజేయ స్ఫూర్తిని, సైనిక వ్యూహాల గురించి అధ్యయనం చేసేలా విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ వైవిధ్యమైన అంశాల ఎంపిక పోటీలకు వచ్చిన ఎంట్రీల నాణ్యతను పెంపొందించింది. అలాగే భారత చారిత్రక, సాంస్కృతిక వారసత్వంపై అవగాహనను పెంచింది.

విదేశాల్లో ఉన్న సీబీఎస్ఈ అనుబంధ పాఠశాలలు మొదటిసారి ఈ పోటీల్లో పాల్గొన్నాయి. 18 దేశాల్లో ఉన్న 91 పాఠశాలలకు చెందిన 28,005 మంది విద్యార్థులు తమ ఎంట్రీలను సమర్పించారు. భారత దేశ పరాక్రమాన్ని, జాతీయ స్ఫూర్తి గాథలను అంతర్జాతీయ ప్రేక్షకులకు చేరువ చేయడంలో, ఈ కార్యక్రమ పరిధిని అంతర్జాతీయ స్థాయికి చేర్చడంలో సాధించిన ముఖ్యమైన విజయాన్ని ఇది సూచిస్తుంది.

ప్రాంతీయ స్థాయి కార్యక్రమాలను పాఠశాలల నిర్వహించగా... జాతీయ స్థాయి చర్చలను శౌర్య పురస్కార గ్రహీతలు (ఆఫ్ లైన్, ఆన్లైన్ రెండింటిలో) చేపట్టారు. మైగవ్ పోర్టల్ ద్వారా ఉత్తమ ఎంట్రీలను సమర్పించారు. 2025 నవంబర్ 10న పాఠశాల స్థాయి పోటీలు పూర్తయ్యాయి. రాష్ట్ర, జిల్లా స్థాయుల్లో మూల్యాంకనం పూర్తయిన అనంతరం దాదాపు 4,020 ఎంట్రీలు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. వాటిలో 100 ఉత్తమ ఎంట్రీలను సూపర్ - 100 విజేతలుగా ఎంపిక చేశారు. గెలుపొందిన వారిని రక్షణ మంత్రిత్వ శాఖ, విద్యా మంత్రిత్వ శాఖ సంయుక్తంగా న్యూఢిల్లీలో సత్కరిస్తాయి. ప్రతి విజేతకు రూ.10,000 నగదు బహుమతితో పాటు విశిష్ట అతిథులుగా కర్తవ్యపథ్‌లో జరిగే గణతంత్ర దినోత్సవాలు-2026ను వీక్షించే అవకాశం లభిస్తుంది.

ఈ వంద మంది విజేతలతో పాటుగా రాష్ట్ర/కేంద్రపాలిత ప్రాంతాల స్థాయిలో 8 మందిని (ప్రతి విభాగం నుంచి ఇద్దరు చొప్పున), జిల్లా స్థాయిలో నలుగురిని (విభాగానికి ఒకరు చొప్పున) ఎంపిక చేసి రాష్ట్ర/కేంద్రపాలిత/జిల్లా అధికారులు సత్కరిస్తారు.

75 ఏళ్ల స్వాతంత్ర్యానికి గుర్తుగా నిర్వహించిన 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా ప్రాజెక్ట్ వీర్ గాథ కార్యక్రమాన్ని 2021లో ప్రారంభించారు. శౌర్య పురస్కార గ్రహీతలు చేసిన సాహసాలు, వారి జీవిత కథల గురించి అవగాహన కల్పించడమే ప్రధానోద్దేశంగా ఈ కార్యక్రమం ప్రారంభమైంది. విద్యార్థుల్లో దేశభక్తి, పౌర విలువలు పెంపొందించేందుకు ఈ కార్యక్రమం తోడ్పడుతుంది. మొదటి విడత నుంచి అయిదో విడత వరకు ప్రాజెక్టు వీర గాథ స్ఫూర్తిదాయక ఉద్యమంగా మారింది. విదేశాల్లో ఉన్న భారతీయ పాఠశాలలకు కూడా చేరుకుంది.

ప్రాజెక్టు వీర్ గాథ ప్రారంభమైన నాటి నుంచి గణనీయమైన వృద్ధిని సాధించింది. మొదటి రెండు సంచికల్లో 25 మంది చొప్పున జాతీయ విజేతలను ఎంపిక చేశారు. మొదటి సంచికలో సుమారు 8 లక్షల మంది విద్యార్థులు పాల్గొనగా రెండో సంచికలో దాదాపు 19 లక్షల మంది పాల్గొన్నారు. మూడో సంచికలో 100 మంది జాతీయ విజేతలను ఎంపిక చేయగా 1.36 కోట్ల మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీర్ గాథ 4.0 నాటికి ఈ సంఖ్య 1.76 కోట్లకు చేరుకుంది.

# గోదావరిఖని సింగరేణి లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో బొమ్మల కొలువు

కరీంనగర్, జనవరి 9: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్ వన్ ఆధ్వర్యంలో గోదావరిఖని ఇల్లందు క్లబ్ లో కనుల పండుగగా బొమ్మల కొలువు నిర్వహించారు. ఆర్జీ-1 లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు జీఎం సతీమణి అనిత లలిత్ కుమార్ అధ్యక్షతన 'బొమ్మల కొలువు' అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సింగరేణి సంస్థ డైరెక్టర్ ఆపరేషన్ సతీమణి ఎల్వీ మాలతి సూర్యనారాయణ, సంస్థ డైరెక్టర్ (ఈఅండ్ఎం) తిరుమల్ రావు, సంస్థ డైరెక్టర్స్ కే విజయ లక్ష్మి వెంకటేశ్వర్లు, పద్మ తిరుమల రావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు డైరెక్టర్ క్యాంపు ఆఫీస్ నుండి భారీ ఎత్తున ఊరేగింపు చేశారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ బొమ్మల కొలువులో మన సంస్కృతి సంప్రదాయం ఉట్టి పడేలా ఉన్నాయని, ఇందులో ప్రత్యేకంగా 7 వైకుంఠ ద్వారాలు చేదా బావి, పొలం, భోగి పండ్లు పోసే కార్యక్రమం, సమ్మక్క సారలమ్మ, చిలకలగుట్ట, నవగ్రహవనాలు, రాశి వనాలు, ఏడు విష్ణుద్వారాలు తో గరుడ ప్రవేశం, అవెూరు, శివుడు, రైసింగ్ తెలంగాణ, శాంతి బౌద్ధ విగ్రహం, ప్రాచీన వస్తువులు అన్ని ప్రదర్శించారు. ఈ విధంగా పల్లెటూరి వాతావరణన్ని సృష్టించి పూర్వపు చరిత్రని ప్రస్తుత వారికి తెలిపేలా బొమ్మల కొలువును ఏర్పాటు చేసిన కుటిరం, మంచే, సంక్రాతి సంబురాలలో ఏర్పాటు చేసే, చుట్టు పక్కల పల్లెటూరి వాతావరణం, చేదబావి, సమ్మక్క-సారక్క సంస్కృతి అనే వివిధ రకాల బొమ్మలతో పలు అంశాలపై అవగాహన కలిగేలా బొమ్మల ను ఏర్పాటు చేశారు. అలాగే తెలంగాణ సాంస్కృతీ సాంప్రదాయాల పురాతన పనిముట్లు, ప్రత్యేక ఆకర్షణ నిలిచాయి.

ధనుర్మాసం సందర్భంగా దశవతారాలు వేషాధారణ తత్త్వంతో ఉట్టి పడే విధంగా వివిధ అలంక్రుత 'బొమ్మల కొలువు' నిర్వహించారు. ఈ బొమ్మల కొలువు వల్ల అందరికీ శుభం జరుగుతుందని తెలిపారు. మొదట వచ్చిన అతిథులు గణపతి పూజ చేసి ప్రారంభించి పాలు పొంగించి వేడుకలు నిర్వహించారు. అలాగే బొమ్మల కొలువులో గణపతి దేవునికి మంగళ హారతులు ఇచ్చి అందరి మీద కరుణ కటాక్షలు ఉండాలని కోరారు. ప్రతీ ఏటా నిర్వహించే 'బొమ్మల కొలువు' ఎంతో రమ్యంగా ఉంటుందని, ఇక్కడి వాతావరణం చూడ చక్కని దృశ్యాలతో ఆకట్టు కునేలా ఉన్నాయని అన్నారు. ఈ సందర్భంగా లేడీస్ క్లబ్ సభ్యులు చేసిన ఆధ్యాత్మికతతో దశావతారాల థీమ్ బొమ్మల కొలువు అంగరంగ వైభవంగా సంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమంలో ఆర్జీ- 1, 2,3 జీఎంలు డీ లలిత్ కుమార్, మధుసూదన్, ఆర్జీ రిజీయన్ క్వాలిటీ జీఎం సుజోయ్ మజుందర్, రెస్క్యూ జీఎం శ్రీనివాస రెడ్డి, నగర పోలీసు కమిషనర్ అంబర్‌కిషోర్‌ఝా సతీమణి త్రిప్తి అంబర్ కిషోర్ ఝా, ఆర్జీ-1,2,3 ఏఎల్‌పీ, ఇతర ఏరియాల జీఎంల సతీమణులు జీ వనజ వెంకటయ్య, ఎస్ తిరుమల, సుప్రియ సుజోయ్ మజుందర్, కే వాణి శ్రీనివాస రెడ్డి, ఎన్ అలివేణి సుధాకర రావు, ఉమ శ్రీనివాస్, వెంకటలక్ష్మి నాగేశ్వరరావు, సునీత రాజేశ్వర్ రెడ్డి, లక్ష్మీ రఘు కుమార్, ఆర్జీ-1 ఏరియాలోని అన్ని గనులు, డిపార్ట్మెంట్ శాఖ అధికారులు, అధికారులు, లేడీస్ క్లబ్ సెక్రటరీ శిరీష చంద్రశేఖర్, లేడీస్ క్లబ్ కమిటీ, సభ్యులతో పాటు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సంగారెడ్డిలో పేద విద్యార్థులకు ఉలెన్ బ్లాంకెట్ల పంపిణీ



సంగారెడ్డి జనవరి 09(నేటి నిజం ప్రతినిధి)సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని సమీకృత బాలుర వసతి గృహంలో పేద విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని శుక్రవారం ఉలెన్ బ్లాంకెట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ వసతి గృహాల్లో నివసిస్తున్న పేద విద్యార్థులకు సేవ చేయాలనే సద్భావనతో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు టి. అఖిలేష్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని, జిల్లా పారిశ్రామిక కేంద్రం జనరల్ మేనేజర్ తీర్చు నాయక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా తీర్చు నాయక్ మాట్లాడుతూ, విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పేద విద్యార్థులకు ఈ విధంగా సేవ చేయడం తనకు లభించిన అదృష్టమని ఆయన పేర్కొన్నారు.

ఈ ఉలెన్ బ్లాంకెట్లను సత్య దివిస్ ఫార్మాస్యూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్, గడ్డపోతారం జనరల్ మేనేజర్ ఏ. నాగేశ్వరరావు సహకారంతో అందజేశారు. కార్యక్రమంలో సహాయ సాంఘిక సంక్షేమ అధికారి బి. శంకర్, వసతి గృహ సంక్షేమ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థుల సంక్షేమానికి తోడ్పాటు అందించడంతో పాటు సమాజంలో సేవాభావాన్ని పెంపొందించినట్లు నిర్వాహకులు తెలిపారు.

# అనుమానం పెనుభూతం..నిండు ప్రాణం బలి

హైదరాబాద్ జనవరి 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ప్రేమిస్తున్నానని వెంటపడ్డాడు... పెళ్లి చేసుకోవడానికి తల్లిదండ్రులను ఒప్పించాడు. ఫోన్‌లో మాట్లాడుతున్నావని వేధించడంతో యువతి వాటర్ ట్యాంక్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా ఎల్ బి నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగోల్ లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... ఖమ్మం జిల్లాకు చెందిన ఐశ్వర్య(19) తన సోదరుడు అరవింద్‌తో కలిసి బండ్లగూడ సమీపంలోని తట్టిఅన్నారంలోని వైఎస్ఆర్ కాలనీలో నివసిస్తోంది. ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలో ఉద్యోగం చేస్తోంది. సూర్యాపేట జిల్లాకు చెందిన వీరి బంధువు మహేష్ అలియాస్ ఆనంద్(23) ఆటో నడుపుతూ హస్తినాపురంలో నివసిస్తున్నాడు. ఆనంద్ బంధువు కావడంతో పలుమార్లు ఐశ్వర్య వాళ్ల ఇంటికి వచ్చాడు. పరిచయం కావడంతో పేమించాలని ఐశ్వర్యను బలవంతం చేశాడు. ప్రేమించి పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో ఆమె ఓకే చెప్పింది. యువతి తల్లిదండ్రులు పెళ్లికి నిరాకరించారు. కానీ తల్లిదండ్రులను ఒప్పించి పెళ్లి చేసుకుంటానని మహేష్‌ను పెళ్లి చేసుకోవడానికి రెడీ అయ్యింది. ప్రియురాలు తరచూ వేరివారితో ఫోన్‌లో మాట్లాడుతుందని ఆమెపై అతడు అనుమానం పెంచుకున్నాడు. జనవరి 5న హౌసింగ్ బోర్డు కాలనీలోని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ వద్దకు ఇద్దరు చేరుకొని మాట్లాడారు. ఫోన్‌లో ఎవరితో మాట్లాడుతున్నావని అనుమానం వ్యక్తం చేయడంతో ఇద్దరు మధ్య గొడవ జరిగింది. మనస్థాపం చెందిన ఐశ్వర్య వెంటనే ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్‌పైకి ఎక్కి దూకింది. వెంటనే ఆమెను నాగోల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం చనిపోయింది. ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మహేష్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి రాజగోపాల్‌ను కలిసిన, టిడబ్ల్యూజేఎఫ్ (హెచ్-2843) నేతలు

## -జర్నలిస్టుల ఇండ్ల స్థలాల అంశాన్ని జిల్లా అధ్యక్షులు సంతోష్ చక్రవర్తి ద్వారా తెలుసుకున్న ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి



ఖమ్మం, జనవరి 9 (నేటి నిజం ప్రతినిధి) :ఖమ్మం జిల్లాలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల కేటాయింపుల అంశంలో నెలకొన్న అనిశ్చితిపై న్యాయ సహకారం అందించాలని కోరుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్- హెచ్-2843) జిల్లా కమిటీ బృందం జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి జి.రాజగోపాల్ ను ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా రాబోయే సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి జి.రాజగోపాల్ కు ముందస్తు శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ భేటీలో జిల్లా అధ్యక్షులు టి.సంతోష్ చక్రవర్తి మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకు మంజూరైన ఇండ్ల స్థలాల విషయంలో ప్రస్తుత ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు తీవ్ర అనిశ్చితిని సృష్టిస్తున్నాయని జడ్జి దృష్టికి తీసుకువచ్చారు. హైదరాబాద్‌లో న్యాయ నిపుణులు జర్నలిస్టుల ఇండ్ల స్థలాల అంశంపై చేసిన సూచనలు, సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా ఉన్న న్యాయపరమైన అంశాలను వివరించి, జర్నలిస్టులకు చట్టపరమైన పరిరక్షణ కల్పించాలని వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు.

దీనికి స్పందించిన ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి రాజగోపాల్, సుప్రీంకోర్టు తీర్పులు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు వర్తిస్తాయని స్పష్టం చేశారు. జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు సమర్పించిన వినతిపత్రంలోని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, చట్ట పరిధిలో సాధ్యమైన న్యాయ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సమాజంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని, కఠిన పరిస్థితులను ఎదుర్కొంటూ ప్రజల పక్షాన నిలబడి వారు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, కోశాధికారి అర్వపల్లి నగేష్, టీబీజేఏ జిల్లా అధ్యక్షులు వందనపు సామ్రాట్ గుప్తా, ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ అంతోటి శ్రీనివాస్, లీగల్ అడ్వైజర్ వనుపులేటి శ్రీనివాసరావు, కుంభం రవి కుమార్, కాసోజు శ్రీధర్, సుధాగాని కరుణాకర్, కప్పల మధు గౌడ్, సాపవత్ నాగరాజు, చిన్నంశెట్టి రాంబాబు, అమరబోయిన ఉపేందర్, కందరపోయిన నాగకృష్ణ, వంగవుంగమ గౌడ్, కొండల్, ఎలుగోటి వెంకట్, కరాటే వేణు, నాయిని స్వాతి, తుమ్మలపల్లి శ్రీనివాస్, షేక్ సోందుమియా, మల్లెల శిల్ప, రమేష్, గంటేల కుమార్, మందడపు మనోహర్, సురేష్, నరేష్ తదితరులున్నారు.

# సికింద్రాబాద్ అస్థిత్వాన్ని దెబ్బ తీసేందుకు ప్రభుత్వం కుట్ర

## -మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

హైదరాబాద్ జనవరి 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );సికింద్రాబాద్‌కు ఓ చరిత్ర ఉంది. సుదీర్ఘ చరిత్ర కలిగిన సికింద్రాబాద్ అస్థిత్వాన్ని దెబ్బ తీసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. సికింద్రాబాద్ కార్పొరేషన్ ఏర్పాటు చేసే వరకు పోరాటం ఆగదన్నారు. ఈ విషయమై తలసాని మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 11వ తేదీన లీ ప్యాలెస్‌లో అన్ని వర్గాలతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ నెల 17వ తేదీన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి ఎంజీరోడ్ లోని గాంధీ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్టు వెల్లడించారు.సికింద్రాబాద్ అంటే లష్కర్ బోనాలు, రాష్ట్రపతి విడిది, డిఫెన్స్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఆర్ట్స్ కాలేజీ, మహబూబ్ కాలేజ్. చరిత్ర ఉన్నప్పటి నుంచి జంట నగరాలు.. అంటే ట్యాంక్ బండ్ అటువైపు హైదరాబాద్- ఇటువైపు సికింద్రాబాద్. కొత్తగా ఏర్పడిన మల్కాజిగిరి గ్రామం, సైబరాబాద్ గ్రామం, శంషాబాద్ గ్రామం.. అవి గ్రామాలు కాలక్రమేణా విస్తరించబడ్డాయి. కానీ చరిత్ర ఉన్నట్వంటి సికింద్రాబాద్ పేరు మార్చి మూడు కార్పోరేషన్లుగా.. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి చేయడమంటే సికింద్రాబాద్ చరిత్ర మార్చేసే ప్రయత్నం. ఆ రోజుల్లో డిఫెన్స్ ఇక్కడికొచ్చినప్పుడు వాళ్ల ఒప్పందం ప్రకారం 1809లో సికింద్రాబాద్ ఏర్పడింది.ఎప్పుడు చూసినా నార్త్ జోన్ ఏరియా సికింద్రాబాద్ ప్రాంతమంతా ప్రశాంతమైన వాతావరణం కనిపిస్తుంది.

# అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో సమావేశమైన కేంద్ర వ్యవసాయ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్



న్యూఢిల్లీ, జనవరి 9:న్యూఢిల్లీలోని కృషి భవన్లో జరిగిన ఉన్నత స్థాయి సమావేశానికి కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ అధ్యక్షత వహించారు. ఆహారం, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ), అంతర్జాతీయ ఆహార కార్యక్రమం (డబ్ల్యూఎఫ్‌పీ), వ్యవయసాయ అభివృద్ధికి అంతర్జాతీయ నిధి (ఐఎఫ్ఏడీ), ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ), డాయిచ్ గేజెల్‌షాఫ్ట్ ఫ్యూర్ ఇంటర్నేషనల్ సుజామెన్‌అర్బైట్ (జీఐజెడ్), జపాన్ ఇంటర్నేషనల్ కోపరేషన్ ఏజెన్సీ (జైకా) సహా ప్రధాన అంతరాజ్తీయ, బహుపాక్షిక అభివృద్ధి భాగస్వాముల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. రైతుల సంక్షేమాన్ని, జీవనోపాధిని మెరుగుపరచడానికి, దీర్ఘకాల విధానాలను రూపొందించడంతో సహా సహకారాన్ని బలోపేతం చేసుకోవడం, దీర్ఘకాల అభివృద్ధి ప్రాధాన్యాలను సమన్వయం చేయడం, సుస్థిరాభివృద్ధి కార్యక్ర మాలకు తోడ్పాటు అందించడంపై ఈ సమావేశంలో దృష్టి సారిం చారు.

ఆహార లోటు నుంచి ప్రధాన వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేసే ప్రధాన దేశంగా మారిన భారతీయ వ్యవసాయ ప్రయాణం అసాధారణమైనదని శ్రీ చౌహాన్ చెప్పారు. దీనిలో అంతర్జాతీయ సంస్థలు పోషించిన పాత్రను వివరించారు. ఆహార భద్రతను సాధించిన భారత్, ఇప్పుడు పోషకాహార భద్రతను సాధించడం, సుస్థిర జీవనోపాధి అవకాశాలను అందించడంపై దృష్టి సారించిందని తెలియజేశారు.

తన అనుభవాన్ని, అనుసరిస్తున్న ఉత్తమ పద్ధతులను ఇతర దేశాలతో పంచుకొనేందుకు భారత్ సిద్ధంగా ఉందని అదే సమయంలో అంతర్జాతీయ ఆవిష్కరణలు, ఇతర దేశాల్లో అవలంబిస్తున్న విజయవంతమైన విధానాలను స్వీకరిస్తుందని తెలియజేశారు. తద్వారా వ్యవసాయం, అనుబంధ రంగాల్లో పరస్పర వృద్ధిని, సహకారాన్ని పెంపొందించుకుంటుందన్నారు.

సమగ్ర వ్యవసాయం, చిన్న రైతులకు మెరుగైన మార్కెట్ అవకాశాలతో సహా సహకారానికి అవకాశమున్న ప్రధాన విభాగాల గురించి ప్రతినిధులు వివరించారు. అలాగే యువత, మహిళలు, రైతు సంఘాలపై ప్రధాన దృష్టి సారించారు. అలాగే పరిశోధనాభివృద్ధి, డిజిటల్ వ్యవసాయం, దిగుబడి అనంతర మౌలిక సదుపాయాలను విస్తరించడంపై దృష్టి సారించడంతో పాటు సాంకేతిక ఆవిష్కరణలు, రుణాలు, ప్రైవేటు రంగ భాగస్వామ్యం, పెట్టుబడుల ప్రాధాన్యం గురించి వారు చర్చించారు. వాతావరణ పరిస్థితులను తట్టుకొనే పంటలు, సహజ వనరుల నిర్వహణ గురించి కూడా చర్చించారు.

విలువైన సలహాలు, సూచనలు అందించిన ప్రతినిధులకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు. ఇవి వ్యవసాయ రంగంలో దీర్ఘకాలిక ప్రణాళికలను బలోపేతం చేయడంలో, విధాన నిర్ణయాలను రూపొందించడంలో కీలకంగా మారతాయని, ఉమ్మడి లక్ష్యాన్ని సాధించే దిశగా మన సహకారాన్ని బలోపేతం చేస్తుందన్నారు.

ఈ సమావేశంలో డీఏ అండ్ ఎఫ్‌డబ్ల్యూ కార్యదర్శి, డీఏఆర్ఈ కార్యదర్శి, డీఏ అండ్ ఎఫ్‌డబ్ల్యూ అదనపు కార్యదర్శులు, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# ట్యూబెక్టమీ వికటించి మృతిచెందిన కేసులో 8 లక్షల పరిహారం

## – మృతురాలి భర్తకు ఉపాధి సిఫార్సు చేసిన తెలంగాణ మానవ హక్కుల కమిషన్

హైదరాబాద్ జనవరి9 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); ట్యూబెక్టమీ వికటించి మృతిచెందిన కేసులో 8 లక్షల పరిహారం తో పాటు మృతురాలి భర్తకు ఉపాధి సిఫార్సు చేసిన తెలంగాణ మానవ హక్కుల కమిషన్ ఉత్తర్వులు జారి సేసింది..ఆర్.సి.నెం.2355 ఆఫ్ 2018 కేసు లో, తేది 06.01.2026 న జారీ చేసిన ఉత్తర్వుల ద్వారా, గౌరవ డా. జస్టిస్ షమీమ్ అక్తర్ అధ్యక్షతన ఉన్న తెలంగాణ మానవ హక్కుల కమిషన్ వనపర్తి జిల్లాలోని ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన ట్యూబెక్టమీ శస్త్రచికిత్స అనంతరం ఎం. లలిత మృతి చెందడానికి వైద్య నిర్లక్ష్యం కారణమైందని నిర్ధారించి, ఇందుకు తెలంగాణ ప్రభుత్వాన్ని వికేరియస్ లయబిలిటీకి లోబరచింది. శస్త్రచికిత్స సమయంలోఇలేల్ పెర్ఫో రేషన్ జరగడం మరియు దానిని సకాలంలో గుర్తించడంలో జరిగిన ఆలస్యం వల్ల సెప్టిక్ పెరిటోనైటిస్ ఏర్పడి కార్డియోపల్మనరీ అరెస్ట్‌కు దారితీసిందని కమిషన్ స్పష్టం చేస్తూ, ఇది సాధారణ శారీరక ప్రతిచర్య మాత్రమే అన్న వాదనను తిరస్కరించింది. ఇప్పటికే చెల్లించిన రూ.2,00,000/- పరిహారం మృతురాలి వికలాంగ భర్త మరియు ఇద్దరు మైనర్ కుమారుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుంటే పూర్తిగా సరిపోదని గమనించిన కమిషన్, అదనంగా రూ. 8,00,000/- పరిహారం చెల్లించాలని సిఫార్సు చేసింది. అలాగే కుటుంబం గౌరవంగా జీవించేందుకు వీలుగా మృతురాలి భర్తకు తగిన ఉపాధిని కల్పించాలని కూడా ప్రభుత్వానికి సూచించింది.

# గోదావరిఖని సింగరేణి లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో బొమ్మల కొలువు



కరీంనగర్, జనవరి 9:సింగరేణి సంస్థ రామగుండం డివిజన్ వన్ ఆధ్వర్యంలో గోదావరిఖని ఇల్లందు క్లబ్ లో కనుల పండుగగా బొమ్మల కొలువు నిర్వహించారు. ఆర్జీ-1 లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు జీఎం సతీమణి అనిత లలిత్ కుమార్ అధ్యక్షతన 'బొమ్మల కొలువు' అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సింగరేణి సంస్థ డైరెక్టర్ ఆపరేషన్ సతీమణి ఎల్‌వీ మాలతి సూర్యనారాయణ, సంస్థ డైరెక్టర్ (ఈఅండ్ఎం) తిరుమల్ రావు, సంస్థ డైరెక్టర్స్ కే విజయ లక్ష్మి వెంకటేశ్వర్లు, పద్మ తిరుమల రావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు డైరెక్టర్ క్యాంపు ఆఫీస్ నుండి భారీ ఎత్తున ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ బొమ్మల కొలువులో మన సంస్కృతి సంప్రదాయం ఉట్టి పడేలా ఉన్నాయని, ఇందులో ప్రత్యేకంగా 7 వైకుంఠ ద్వారాలు చేదా బావి, పొలం, భోగి పండ్లు పోసే కార్యక్రమం, సమ్మక్క సారలమ్మ, చిలకలగుట్ట, నవగ్రహవనాలు, రాశి వనాలు, ఏడు విష్ణుద్వారాలు తో గరుడ ప్రవేశం, అమ్మోరు, శివుడు, రైసింగ్ తెలంగాణ, శాంతి బౌద్ధ విగ్రహం, ప్రాచీన వస్తువులు అన్ని ప్రదర్శించారు. ఈ విధంగా పల్లెటూరి వాతావరణన్ని సృష్టించి పూర్వపు చరిత్రని ప్రస్తుత వారికి తెలిపేలా బొమ్మల కొలువును ఏర్పాటు చేసిన కుటిరం, మంచె, సంక్రాతి సంబురాలలో ఏర్పాటు చేసే, చుట్టు పక్కల పల్లెటూరి వాతావరణం, చేదబావి, సమ్మక్క-సారక్క సంస్కృతి అనే వివిధ రకాల బొమ్మలతో పలు అంశాలపై అవగాహన కలిగేలా బొమ్మలను ఏర్పాటు చేశారు. అలాగే తెలంగాణ సాంస్కృతీ సాంప్రదాయాల పురాతన పనిముట్లు, ప్రత్యేక ఆకర్షణ నిలిచాయి.

ధనుర్మాసం సందర్భంగా దశవతారాలు వేషాధారణ తత్త్వంతో ఉట్టి పడే విధంగా వివిధ అలంక్రుత 'బొమ్మల కొలువు' నిర్వహించారు. ఈ బొమ్మల కొలువు వల్ల అందరికీ శుభం జరుగుతుందని తెలిపారు. మొదట వచ్చిన అతిథులు గణపతి పూజ చేసి ప్రారంభించి పాలు పొంగించి వేడుకలు నిర్వహించారు. అలాగే బొమ్మల కొలువులో గణపతి దేవునికి మంగళ హారతులు ఇచ్చి అందరి మీద కరుణ కటాక్షలు ఉండాలని కోరారు. ప్రతీ ఏటా నిర్వహించే 'బొమ్మల కొలువు' ఎంతో రమ్యంగా ఉంటుందని, ఇక్కడి వాతావరణం చూడ చక్కని దృశ్యాలతో ఆకట్టుకునేలా ఉన్నాయని అన్నారు. ఈ సందర్భంగా లేడీస్ క్లబ్ సభ్యులు చేసిన ఆధ్యాత్మికతతో దశావతారాల థీమ్ బొమ్మల కొలువు అంగరంగ వైభవంగా సంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమంలో ఆర్జీ-1,2,3 జీఎంలు డీ లలిత్ కుమార్, మధుసూదన్, ఆర్జీ రిజీయన్ క్వాలిటీ జీఎం సుజోయ్ మజుందర్, రెస్క్యు జీఎం శ్రీనివాస రెడ్డి, నగర పోలీసు కమిషనర్ అంబర్‌కిషోర్‌ఝా సతీమణి త్రిప్తి అంబర్ కిషోర్ ఝా, ఆర్జీ-1,2,3 ఏఎల్‌పీ, ఇతర ఏరియాల జీఎంల సతీమణులు జీ వనజ వెంకటయ్య, ఎస్ తిరుమల, సుప్రియ సుజోయ్ మజుందర్, కే వాణి శ్రీనివాస రెడ్డి, ఎన్ అలివేణి సుధాకర రావు, ఉమ శ్రీనివాస్, వెంకట లక్ష్మి నాగేశ్వరరావు, సునీత రాజేశ్వర్ రెడ్డి, లక్ష్మి రఘు కుమార్, ఆర్జీ-1 ఏరియాలోని అన్ని గనులు, డిపార్ట్మెంట్ శాఖ అధికారులు, అధికారులు, లేడీస్ క్లబ్ సెక్రటరీ శిరీష చంద్రశేఖర్, లేడీస్ క్లబ్ కమిటీ, సభ్యులతో పాటు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# స్థానిక సమస్యలపై పట్టించుకోని ప్రభుత్వం

## -వరంగల్ జిల్లాలో భారతీయ జనతా పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



వరంగల్ జనవరి 9 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు గురువారం వరంగల్, హన్మకొండ జిల్లాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లాలో భారతీయ జనతా పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావే శంలో ఆయన మాట్లాడారు. బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇది నా మొదటి అధికారిక పర్యటన కావడం నాకు చాలా ఆనందంగా ఉంది. వరంగల్‌లో భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని దర్శించడం ఒక ప్రత్యేక ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించింది. వరంగల్‌లో అనేక స్థానిక సమస్యలు ఉన్నాయి. గతంలో బీఆర్ఎస్ సర్కారు "స్లమ్ ఫ్రీ సిటీ"గా మార్చుతామని హామీ ఇచ్చినప్పటికీ, ఏ పనీ జరగలేదు. వానకాలంలో చాలా ప్రాంతాల్లో వరదల కారణంగా ఇండ్లు మునిగిపోవడం వంటి పరిస్థితులు మనం చూశాం. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పటికీ, స్థానిక సమస్యలపై పట్టించుకోలేదు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్, మాస్టర్ ప్లాన్ అమలు, వందల కోట్ల ప్రత్యేక నిధుల హామీలు అంటూ ప్రకటించినా ఏ ఒక్కటీ సాకారం కాలేదు. బిజెపి నుంచి ఈ ప్రాంతానికి ఒక్క ఎంపీ గాని, ఎమ్మెల్యే గాని లేకపోయినా, కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం రూ. 2 వేల కోట్లకు పైగా నిధులు విడుదల చేసి, వరంగల్ అభివృద్ధికి కృషి చేసింది. ఇంకా, కాజీపేట్ కోచ్ ఫ్యాక్టరీని ఆధునికంగా నిర్మించడం, భద్రకాళి చెరువు, పద్మాక్షి ఆలయం, వేయిస్తంభాల గుడి అభివృద్ధి- ఇలా కేంద్రం సహకారంతోనే సాధ్యమయ్యాయి. మామునూరు విమానాశ్రయం అభివృద్ధికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది, దీని వల్ల వరంగల్‌కు రెండవ కమర్షియల్ ఎయిర్ కనెక్టివిటీ, ప్రయాణ సౌకర్యం, వ్యాపార-పారిశ్రామిక అవకాశాల విస్తరణ సాధ్యమవుతుంది. స్మార్ట్ సిటీ, హృయ్, అమృత్, రూర్బన్ పథకాల ద్వారా వేలకోట్ల నిధులు వరంగల్ అభివృద్ధికి కేటాయిం చడం జరిగింది. ములుగు సమ్మక్క-సారక్క ట్రైబల్ యూనివ ర్సిటీ కూడా కేంద్రం మంజూరు చేసింది. రాబోయే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్నాను. గత రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో ఇచ్చిన హామీలు అమలు కాలేదు. రైతులు రుణమాఫీ పొందలేకపోయారు, విద్యార్థులు ఉద్యోగాలు పొందలేదు, విద్యా సంస్థలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్ లోనే ఉన్నాయి. ఇవేమీ పరిష్కరించబడలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా కాళేశ్వరం, ఇతర ప్రాజెక్టుల పేర్లతో ప్రజాధనాన్ని దోచుకుంది. రెండేళ్ల క్రితం ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చింది. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలు విషయాన్నే మర్చిపో యింది. గతంలో ఉల్లిగడ్డ దామెరలో నేను రచ్చబండ కార్యక్రమం నిర్వహించినప్పుడు రైతులు ఎంతో ఆవేదనతో నాతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఒక్కో రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పారని, కానీ ఇప్పటివరకు సరిగ్గా రుణమాఫీ జరగలేదని రైతులు స్పష్టంగా తెలిపారు. అలాగే రైతు భరోసా కింద రూ.15 వేల చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ ఆ వాగ్దానం కూడా నెరవేంలేదు. విద్యార్థులకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, 35 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకుంటోంది. కానీ వారు చెప్పే నియామక పరీక్షలు, ఉద్యోగాల అంశాలు కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయని అందరికీ తెలుసు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో ఏ వర్గానికి కూడా న్యాయం జరగలేదు. రైతులు, యువత, పేదలు, మధ్యతరగతి-అందరూ మోసపోయారు. ఇక గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు సహా ఇతర ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనాన్ని కేవలం తమ కుటుంబ ప్రయోజనాల కోసం దోచుకుంది. ప్రజలకు చేసిందేమీ లేదు. బీఆర్ఎస్ ప్రజావ్యతిరేక పాలనను వ్యతిరేకించి కాంగ్రెస్‌ను గెలిపిస్తే, పరిస్థితి మరింత దారుణంగా మారిందని తెలంగాణ ప్రజలు ఇప్పుడు బాధపడుతున్నారు. ఎక్కడ ప్రభుత్వ భూములు ఉన్నాయో, అక్కడ వాటిని అమ్మడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయంగా మారింది. ఏ భూమిని ఎంత కమిషన్‌తో, ఏ కాంట్రాక్టర్‌కు అప్పగించా లన్న దానిపైనే వారి దృష్టి ఉంది. అందుకే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కమిషన్ల, కాంట్రాక్టర్ల ప్రభుత్వంగా మారింది. ఇక మరోవైపు హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (హిల్ట్) పాలసీని తీసుకువచ్చి, రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని పెంచుకునే ప్రయత్నం చేస్తోంది. ఈ హిల్ట్ పాలసీ ద్వారా 22 పారిశ్రామిక వాడలను అన్యాక్రాంతం చేయాలనే ఆలోచనలో ఉంది. పరిశ్రమలను మూసివేసి, పారిశ్రామిక భూములను రియల్ ఎస్టేట్ భూములుగా మార్చాలన్న దురుద్దేశం స్పష్టంగా కనిపిస్తోంది. దేశవ్యాప్తంగా నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో భారత్ అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది. కానీ తెలంగాణలో మాత్రం కాంగ్రెస్-బీఆర్ఎస్ పార్టీల అవినీతి, దోపిడీ వల్ల రాష్ట్రం వెనక్కి నెట్టబడుతోంది. ఈ అవినీతికి చెక్ పెట్టాలంటే, నిజమైన అభివృద్ధిని తీసుకురావాలంటే భారతీయ జనతా పార్టీకి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరుతున్నాను. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బిజెపిని గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నాను. మున్సిపాలిటీల స్వరూపాన్ని పూర్తిగా మార్చి, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాలతో అద్భుతంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇస్తున్నాను. ఇటీవల గ్రామపంచాయతీల్లో ప్రజలు బిజెపికి ఇచ్చిన ఆదరణను కొనసాగిస్తూ, మున్సిపల్ ఎన్నికల్లో కూడా మరింత బలంగా బిజెపిని గెలిపించాలని కోరుతున్నాను. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో బిజెపిని అత్యధిక సీట్లలో గెలిపిస్తే, నేను తప్పకుండా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గారితో మాట్లాడి, తెలంగాణను అభివృద్ధి మార్గంలో వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తానన్నారు..

# హాస్పిటల్లో వెంటిలేటర్ వినియోగానికి కొత్త నిబంధనలు


న్యూ డిల్లీ జనవరి 9 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స ఖర్చులపై వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ కీలక మార్గదర్శకాలు విడుదల చేసింది. వెంటిలేటర్ వినియోగం రోగి ప్రాణరక్షణ కోసమేనని స్పష్టం చేసింది. కుటుంబ సభ్యులకు పూర్తి సమాచారం ఇచ్చి వ్రాతపూర్వక అనుమతి తీసుకున్న తర్వాతే వెంటిలేటర్పై ఉంచాలని ఆదేశించింది. అనుమతి లేకుండా వాడితే ఆ ఖర్చు కుటుంబం చెల్లించనవసరం లేదని తెలిపింది. అవసరమైన వైద్య కారణాలు ఉన్నప్పుడే వినియోగం చేయాలని, దీర్ఘకాల చికిత్సకు ప్రత్యేక సమీక్ష కమిటీల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని మార్గదర్శకాలు సూచించాయి.

# ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గా లావణ్య

హ్యైరాబాద్ జనవరి 9 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గా సికింద్రాబాద్ జిల్లా, యూనివర్సిటీ పీజీ కాలేజీ విద్యార్థి లావణ్య ఎన్నిక య్యారు. ఈనెల 3,4,5 తేదీల లో శంషాబాద్ లో జరిగిన 44వ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర అధ్యక్షులు డా రావల కృష్ణ సార్ నూతన కార్యవ ర్గంను ప్రకటించగా సికింద్రాబాద్ నుండి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా లావణ్య,శ్రీరామ్, గౌతమ్ రెడ్డి దక్కింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ పై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యవర్గం లో అవకాశం కల్పించిన రాష్ట్ర శాఖకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో, విద్యార్థులలో జాతీయవాదం పెంచడానికి కృషి చేస్తామని తెలిపారు. నాయకులు యువజన నాయకులు పలువురు అభినందనలు తెలిపారు...

# సక్రమంగా నీరందించక, అక్రమంగా డబ్బు వసూల్

## – రాష్ట్ర జలమండలి ఐఏఎస్ అధికారీ అశోక్ రెడ్డి కి వినతి పత్రం




హైదరాబాద్ జనవరి 9 (వేక్స్ ప్రెస్ న్యూస్ ;భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులు శుక్రవారం రోజున ఖైరతాబాద్ లో గల రాష్ట్ర జలమండలి ఐఏఎస్ అధికారి అశోక్ రెడ్డినీ మర్యాద పూర్వకముగా కలువడం జరిగిన దరివిలా జలమండలి డివిజన్ 18 అధికారుల వ్యవహార శైలిని, వారు ప్రజలకు నీటి బిల్లుల రూపేణా తలపెట్టిన మహా అన్యాయాన్ని పునరాలించించ వలసిన అవసరం ఎంతైనా ఉన్నదని తెలియపరుస్తూ వినతి పత్రం సమర్పించడం జరిగినది. 2019 వరకు మణికొండ, పుప్పాలగూడ, నెక్నంపూర్ లు గ్రామ పంచాయతీలుగా ఉన్నప్పుడు గ్రామం పేరున ఏక మొత్తముగా నీటి వినియోగ రుసుము కట్టేవారు. మున్సిపాలిటీగా పరిణితి చెందిన తత్ పర్యంతం జనాభా భారీగా పెరిగినను నీటి సరఫరా మాత్రం పెరగలేదు, పై పెచ్చు నీటి సరఫరా అయినను కాకున్నను గడచిన ఐదు సంవత్సరములుగా నీటి బిల్లు ఇవ్వకుండా, వసూలు చేయకుండా పని చేయని వారిని శిక్షించకుండా అమాయక ప్రజలను ఇబ్బంది పెడుతూ బిల్లులు కట్టమని వత్తిడి చేయడం పద్ధతి కాదని పేర్కొన్నారు. మున్సిపాలిటీ పెనాల్టీ తీసుకొనీ అక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇచ్చినను నీటి సరఫరాకు మూడు రెట్లు పెనాలిటీ వేయడం అనాగరిక చర్యగా, చట్ట రీత్యా ఇట్టి చర్య ఎంత వరకు సబబని, కాంప్లెక్ లను వదిలి పెట్టీ సాధారణ వినియోగదారుల వద్ద అభివృద్ధి అని, వాల్యుల పేర అధిక రుసుము వసూలు చేయడం పరిపాటి కాగా వాటర్ మీటర్ లు చెడిపోతే అసలు పట్టించుకొనే నాధుడే కరువైనారని స్థానికులు వాపోతున్నారు. ఇకపోతే కన్స్యూమర్ అకౌంట్ నంబర్ లేదనే నేపముతో ఇబ్బడి ముబ్బడిగా రుసుమును వసూలు చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. అంతే కాకుండ చట్టంతో పనిలేకుండా కనెక్షన్ ల పేరుతో పద్ధతి లేకుండా తమ ఇష్టానుసారం పైప్ లైన్ కనెక్షన్ ఇస్తున్న వసూలు రాజాలపై విజిలెన్స్ ఎంక్వైరీ వేయాలని బి.ఆర్.ఎస్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజా ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటు బుల్డోజర్ వ్యవహార శైలితో ప్రజలపై బారం మోపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, అక్రమాలన్నీ సక్రమం చేయాలని కోరుతూ, లేని ఎడల ప్రజల మద్దతుతో ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన కార్యక్రమం చేపట్ట గలమని జలమండలి అధికారులను హెచ్చరించడమైనది. ఇట్టి సందర్భముగా స్థానిక బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ, కుంభగల్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, నవీన్ కుమార్, అందే లక్ష్మణ్ రావు, సంగం శ్రీకాంత్, భాను చందర్, సుమనళిని, బిందు, రఫీక్, ఆశ్ఫాక్ అలీ తది తరులు పాల్గొన్నారు.

# బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్ ద్వారా టైఫాయిడ్ జ్వరం వస్తుంది

## – హై ఫీవర్, తలనొప్పి, కడుపు నొప్పి, అలసట

## -ఒకటి నుంచి మూడు వారాల్లోగా కనిపించనున్న లక్షణాలు

న్యూఢిల్లీ జనవరి 9 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్ ద్వారా టైఫాయిడ్ జ్వరం వస్తుంది. కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వల్ల ఇలా జరుగుతున్నది. ఒకటి నుంచి మూడు వారాల్లోగా లక్షణాలు కనిపిస్తాయి. హై ఫీవర్, తలనొప్పి, కడుపు నొప్పి, అలసట వస్తుంది. యాంటీబయాటిక్స్, సపోర్టి కేర్ ద్వారా చికిత్స అందిస్తారు. లండన్ స్కూల్ ఆఫ్ హైజీన్ అండ్ ట్రాపికల్ మెడిసిన్ అండ్ క్రిస్టియన్ మెడికల్ కాలేజీ(వెల్లోర్) పరిశోధకులు టైఫాయిడ్ ఫీవర్‌పై నివేదిక రూపొందించారు. ఢిల్లీ, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల్లో ఎక్కువ శాతం ఫ్లోరోక్వినోలోన్ రెసిస్టెంట్ కేసులను గుర్తించారు. ఈ రాష్ట్రాల్లో మరణాలు కూడా ఎక్కువే ఉన్నట్లు నివేదికలో పేర్కొన్నారు. 2023 సంవత్సరంలో దేశంలో సుమారు 49 లక్షల టైఫాయిడ్ జ్వరం కేసులు నమోదు అయినట్లు ఓ నివేదికలో వెల్లడైంది. దీంట్లో 7850 మరణించినట్లు పేర్కొన్నారు. ఢిల్లీ, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల్లో టైఫాయిడ్ జ్వరం కేసులు అధికంగా ఉన్నాయి. ఆ రాష్ట్రాల్లో సుమారు 30 శాతం కేసులు నమోదు అయినట్లు నివేదిక ద్వారా తెలిసింది. ద లాన్సెట్ రీజినల్ హెల్త్ సౌత్ఈస్ట్ ఏషియాలో ఆ [illegible] ప్రచురించారు. టైఫాయిడ్ జ్వరం సోకినవారిలో 7.3 లక్షల మంది ఆస్పత్రిలో చేరారని, దాంట్లో ఆరు లక్షల మందికి ఫ్లోరోక్వినోలోన్ రెసిస్టెన్స్ కలిగి ఉన్నట్లు నిర్ధారణ జరిగింది. యాంటీ బయాటిక్, యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ మందుగా దీన్ని వాడుతారు.

# తెలంగాణకు ఆంధ్రా ప్రాంత ప్రేమను తీసుకెళ్లండి

## -తెలంగాణ సోదర సోదరిమణులను సంక్రాంతికి ఆహ్వానించండి

## -డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

అమరావతి జనవరి 9 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: పిఠాపురంలో ఏ చిన్న సంఘటన జరిగినా వైరల్ చేస్తున్నారని ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ తెలిపారు. పిఠాపురంలో కాకి ఈక పడినా ఏదో జరిగిందని ప్రచారం చేస్తున్నారని అన్నారు. పిఠాపురంలో పవన్ పర్యటించారు. పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏదైనా చెడగొట్టడం, కూలగొట్టడం చాలా తేలికని.. నిర్మించడం కష్టమని.. ఒక కూటమిని నిర్మించడం చాలా కష్టమని తెలియజేశారు. అందరినీ ఏకతాటిపై నడిపించడం చాలా కష్టమని అన్నారు. తెలంగాణకు ఆంధ్రా ప్రాంత ప్రేమను తీసుకెళ్లండని, తెలంగాణ సోదర సోదరిమణులను సంక్రాంతికి ఆహ్వానించండని సూచించారు. తెలంగాణ సోదరసోదరీమణులకు గోదావరి జిల్లాల ఆతిథ్యం రుచి చూపండని, తాను వ్యవస్థను బలోపేతం చేసేందుకు వచ్చానని అన్నారు. గత ప్రభుత్వంలో ఏం చేశారో వైసిపి నాయకులను అడగాలని, పిఠాపురంలో స్కూల్లో పిల్లలు కొట్టుకున్నా పెద్దవార్త అవుతుందని విమర్శించారు. పిల్లల కొట్లాటలో కూడా కులాలను తీసుకొస్తున్నారని, పులివెందులలో సొంత బాబాయిని చంపినా అది వార్త కాదని అన్నారు. తనను పరిమితం చేస్తే తన శక్తిని చంపేనట్టేనని, తనను బలోపేతం చేస్తే మరింతగా పనిచేస్తానని పేర్కొన్నారు. అవాస్తవాలను వైరల్ చేయడం మానుకోవాలని పవన్ కల్యాణ్ సూచించారు.



# పట్టాదారు పాసు పుస్తకాన్నిఎవరూ ట్యాంపరింగ్ చేసినా కఠిన చర్యలు: చంద్రబాబు

అమరావతి జనవరి 9 (ఎక్స్ ప్రెస్ న్యూస్: పట్టాదారు పాసు పుస్తకాన్నిఎవరూ ట్యాంపరింగ్ చేయలేరని ఎవరైనా ట్యాంపరింగ్ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైట్ లింగ్ యాక్ట్ ను రద్దు చేశామని చంద్రబాబు నాయుడు తెలిపారు.. తూర్పుగోదావరి జిల్లా రాయవరంను సిఎం పర్యటించారు. రెవెన్యూ సమస్యలు పరిష్కారంపై క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉంది వివాదాలను సృష్టించడానికి కాదు.. పరిష్కరించడానికి అని తెలియజేశారు. సర్వే రాళ్లపై మాజీ సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కోట్లు ఖర్చు పెట్టారని, వైసిపి హయాంలో రీ సర్వే పేరుతో గందరగోళం చేశారని విమర్శించారు. పట్టాదారు పాసు పుస్తకాలపై జగన్ ఫోటో పెట్టుకున్నారని, పోలవరం పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని చంద్రబాబు అన్నారు. మార్చికల్లా పోలవరం ఫేజ్-1 పనులు పూర్తి చేస్తామని, జగన్ వివాదాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. తమకు కావాల్సింది గొడవలు కాదు.. రాష్ట్ర ప్రయోజనాలని, పట్టిసీమ వస్తే గోదావరి జిల్లాలు ఎడారి అవుతాయని జగన్ అన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరు తప్పు చేసినా తాట తీస్తామని, వైసిపి హయాంలో గంజాయి విచ్చలవిడిగా దొరికేదని అన్నారు. ఎపిని జగన్ నాశనం చేశారని ధ్వజమెత్తారు. ఆడబిడ్డల జోలికి వస్తే అదే చివరి రోజు అవుతుందని హెచ్చరించారు. టిటిడి పవిత్రతను కాపాడే బాధ్యత తనదని.. టిటిడి మద్యం బాటిళ్ల వ్యవహారంలోనూ వైసిపి ఉందని చంద్రబాబు పేర్కొన్నారు.

# క్యాట్ పరీక్షల్లో సిరిసిల్లశ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ



రాజన్న సిరిసిల్ల, జనవరి 09: గత కొద్దిరోజుల క్రితం నిర్వహించబడిన క్యాట్ పరీక్ష ఫలితాలలో సిరిసిల్ల శ్రీ చైతన్య విద్యార్థులు 108 మంది ఎంపికయ్యారు. 23 విద్యార్థులు క్యాష్ ప్రైజ్, మెడల్స్, 67 విద్యార్థులు మెడల్స్,మెరిట్ సర్టిఫికెట్ గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజిరెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం మధుసూదన్, కోఆర్డినేటర్ రాంబాబు , డీన్ గాజుల గణేష్,, సీ బ్రాంచ్ ఇంచార్జ్ సిహెచ్ రవీందర్ ఒలంపిక్ ఇంచార్జ్ వెంకటేశం, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మనూ యూనివర్సిటీ భూములను కొల్లగొట్టేందుకు రేవంత్ సర్కార్ కుట్రలు

## -యూనివర్సిటీ భూముల జోలికి వస్తే ఊరుకునేది లేదు మనూ విద్యార్థులు హెచ్చరిక

హైదరాబాద్ జనవరి 9 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );యూనివర్సిటీ భూములను కొల్లగొట్టేందుకు రేవంత్ సర్కార్ కుట్రలు చేస్తోందని మనూ విద్యార్థులు ఆరోపించారు. భూముల అమ్మకాలపై పోరాటం చేస్తుంటే వేధిస్తున్నారని మండిపడ్డారు. యూనివర్సిటీ భూముల జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. యూనివర్సిటీల్లో రియల్ ఎస్టేట్ దందా చేస్తే సహించమని వార్నింగ్ ఇచ్చారు. రాజ్యాంగం పట్టుకుని తిరిగేవాళ్లు విద్యార్థులకు అన్యాయంపై స్పందించరా అని ప్రశ్నించారు. హైదరాబాద్ నందినగర్‌లోని నివాసంలో కేటీఆర్‌తో సమావేశం అనంతరం మనూ విద్యార్థులు మీడియాతో మాట్లాడారు. రేవంత్ సర్కార్ కుట్రలపై ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.



ఈ వ్యవహారంపై ఎంపీలందరూ వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. మనూ భూములపై అధికారులు రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాలన్నారు. లేదంటే దేశవ్యాప్తంగా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అన్ని యూనివర్సిటీల విద్యార్థులతో కలిసి పోరాటాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు.

మనూ వర్సిటీలో జరుగుతున్న కుట్రలపై కేంద్రం స్పందించాలని డిమాండ్ చేశారు. రేవంత్ కుట్రలతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని మనూ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వసతులు కల్పించకుండా భూములు అమ్ముతామంటే ఎలా అని మండిపడ్డారు. రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని మనూ విద్యార్థులు విమర్శించారు. భవిష్యత్ తరాలకు విద్య లేకుండా చేసేందుకు రేవంత్ కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ సర్కార్ దురుద్దేశ్యంతో విద్యార్థులకు మోసం చేస్తుందని అన్నారు. మనూలో మౌలిక వసతులను మరింత మెరుగుపరచాలని డిమాండ్ చేశారు.

# గౌతమ్ మోడల్ స్కూల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు



రాజన్న సిరిసిల్ల,జనవరి 9: నేటినిజం (ప్రతినిధి): వేములవాడ గౌతమ్ మోడల్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన ముందస్తు వేడుకలు కనువిందు చేశాయి. విద్యార్థులంతా రంగురంగుల సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబై పండుగ శోభను తీసుకొచ్చారు. పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన భోగి మంటలు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలతో ఆ ప్రాంతమంతా కోలాహలంగా మారింది. విద్యార్థులు ఉత్సాహంగా ముగ్గులు వేసి గొబ్బెమ్మలతో అలంకరించి ముచ్చటగొలిపారు. సంక్రాంతి, కనుమ పండుగల విశిష్టతను చాటిచెప్పేలా విద్యార్థులు చేసిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాఠశాల కరస్పాండెంట్ బూర ఉమా-రమేష్ మాట్లాడుతూ మన పూర్వీకులు అందించిన గొప్ప సంస్కృతిని, సంప్రదాయాలను నేటి తరం పిల్లలకు పరిచయం చేయడమే ఈ వేడుకల ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

# కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్ లో ముందస్తు సంక్రాంతి



రాజన్న సిరిసిల్ల,జనవరి 9: నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని స్థానిక కిడ్స్ కాన్వెంట్ స్కూల్ లో ముందస్తుగా సంక్రాంతి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు.స్కూల్ ప్రాంగణం పండుగ వాతావరణంతో కళకళలాడింది. వేడుకల్లో భాగంగా చిన్నారులు రంగురంగుల సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని, సంక్రాంతి ప్రత్యేకతను ప్రతిబింబించే కార్యక్రమాలతో అలరించారు. ముఖ్యంగా విద్యార్థులు వేసిన అందమైన ముగ్గులు, రంగోలీలు అందరినీ ఆకట్టుకున్నాయి. పిల్లలు ముగ్గుల ద్వారా మన సంప్రదాయం, సంస్కృతి, సంక్రాంతి పండుగ విశిష్టతను చక్కగా ప్రతిబింబించారు. ఉపాధ్యాయులు చిన్నారులకు సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతను వివరించి, సంప్రదాయాల పరిరక్షణ అవసరాన్ని తెలియజేశారు.

# అశోక్ నగర్‌లో నిరుద్యోగులను కలిసే దమ్ముందా ?..హరీష్ రావు

హైదరాబాద్ జనవరి 9 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: సినిమా థియేటర్ ఓపెనింగ్‌కు వెళ్తన్నారని, ఇప్పుడు అదే అశోక్ నగర్‌లో నిరుద్యోగులను కలిసే దమ్ముందా అని బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్ రావు ప్రశ్నించారు. అదే అశోక్ నగర్‌లో ఎన్నికల సమయంలో రేవంత్, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పోయి కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మొదటి సంవత్సరంలోనే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటివరకు జాబ్ నోటిఫికేషన్ ఇవ్వలేదని మండిపడ్డారు. ఆ థియేటర్ పక్కనే సెంట్రల్ లైబ్రరీ ఉంటుందని, ఇప్పుడు ఒక్కసారి అక్కడికి వెళ్లిరా? అని రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. మొన్న శ్రీధర్ బాబు అసెంబ్లీలో అందరికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వలేమని చేతులెత్తేశారని, భట్టి విక్రమార్క ఏమో జాబ్ క్యాలెండర్ పెట్టి జాబ్ లెస్ క్యాలెండర్ చేశారని చురకలంటించారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి అశోక్ నగర్‌కు వెళ్తుంటే వేల మంది పోలీసులను భద్రతగా పెట్టుకున్నారని మండిపడ్డారు. నిన్న మొన్న నిరుద్యోగులు జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నోటిఫికేషన్లు ఇవ్వాలని నిరసనలు చేస్తే పోలీసులతో బూతులు తిట్టించడంతో కొట్టించారని దుయ్యబట్టారు.

# తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీలో పేపర్ లీక్ ఘటనపై మండిపడ్డ హరీశ్‌రావు

## -పరీక్షల నిర్వహణలో ప్రభుత్వ చేతగానితనాన్ని, అసమర్థతను, అవినీతిని బట్టబయలు చేస్తోంది


హైదరాబాద్ జనవరి 9 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీలో పేపర్ లీక్ ఘటనపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకులు హరీశ్‌రావు మండిపడ్డారు. ఈ ఘటన పరీక్షల నిర్వహణలో ప్రభుత్వ చేతగానితనాన్ని, అసమర్థతను, అవినీతిని బట్టబయలు చేస్తోం దని విమర్శించారు. మొన్నటి పీజీ వైద్య విద్య పరీక్షల్లో బయటపడిన మెడికల్ స్కాం ఇంకా మరువకముందే, ఇప్పుడు అగ్రికల్చర్ బీఎస్సీ పరీక్షల్లో ప్రశ్నాపత్రాలను వాట్సాప్ ద్వారా ముందుగానే లీక్ చేసి, ౦ఎ పెన్‌లతో రాసిన మోడ్రన్ స్కాం రాష్ట్రాన్నిగ్రాఙ్తింతికి గురి చేస్తోందని అన్నారు. ఇంత బహిరంగంగా, అక్రమంగా పరీక్షలు జరుగుతుంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తున్నట్లు అని ప్రశ్నించారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుంటే, ఈ ప్రభుత్వం ఎందుకు మొద్దు నిద్రలో మునిగి ఉందని నిలదీశారు.

మార్పు తెస్తామంటూ అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, రెండేళ్ల వ్యవధిలోనే స్కాంలకు చిరునామాగా మారడం దురదృష్టకరమని హరీశ్‌రావు అన్నారు. చివరకు విద్యా సంస్థలు సైతం అవినీతికి కేంద్రంగా మారడం రాష్ట్ర ప్రభుత్వ దిగజారుడుతనానికి, రేవంతు రెడ్డి విలువల్లేనితనానికి నిదర్శనమని ఆరోపించారు. మహాకవి శ్రీశ్రీ "కాదేదీ కవితకు అనర్హం" అని చెప్పారు? కానీ రేవంత్ రెడ్డి "కాదేదీ స్కాంకు అనర్హం" అని చెప్పడమే కాకుండా, చేసి చూపిస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వడం చేతకాదు, పరీక్షలను సక్రమంగా నిర్వహించడం చేతకాదు..ఇది రేవంత్ మార్క్ ప్రభుత్వ వైఫల్యమని మండిపడ్డారు.పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడిన అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# 3వ పటేల్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ ప్రారంభించిన మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య

## -ఉత్సాహంగా పాల్గొన్న పటేల్ యువత

వేములవాడ,జనవరి 09: రాష్ట్ర వ్యాప్త పటేల్ క్రికెట్ 3వ ప్రీమియర్ లీగ్ పటేల్ యూత్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్ పటేల్ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో హట్టహాసంగా ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య హాజరయ్యి క్రికెట్ మ్యాచ్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండ దేవయ్య పటేల్ మాటాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్నూరు కాపు సామాజిక వర్గాన్ని ఒక్క తాటిపైకి చేర్చుట కోసం ప్రతి సంవత్సరం క్రికెట్ ప్రీమియర్ లీగ్ నిర్వహిస్తున్నాం అని తెలిపారు. దాదాపు రాష్ట్ర వ్యాప్తంగా 50 టీంలు నమోదు చేసుకున్నారని తెలిపారు. కావున యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గెలుపొందిన విజేతలకు మూడవ రోజున బహుమతి ప్రదానం అందిస్తున్నట్లు తెలిపారు. పటేల్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ లు నిర్వహించడం వల్ల యువతలో చైతన్యం వస్తుందని తెలిపారు .ఈ కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక ప్రెసిడెంట్ పొలాస నరేందర్,కౌన్సిలర్ మారం కుమార్, మున్నూరు కాపు సత్రం డైరెక్టర్ కూరగాయల్ మల్లేశం,తడగొండ మాజీ సర్పంచ్ చందం రమేష్, సంపత్ కుమార్,మడ్డపెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.



# వైకుంఠ ద్వార దర్శనాల సందర్భంగా శ్రీవారికి రూ. 41.14 కోట్ల ఆదాయం

## -టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడి

తిరుమల జనవరి 9 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: వైకుంఠ ద్వార



దర్శనాలను అద్భుతంగా జరిపామని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. టీటీడీ ఏర్పాటుచేసిన సౌకర్యాలపై భక్తులు హర్షం వ్యక్తం చేశారని చైర్మన్ తెలిపారు.వైకుంఠ ద్వార దర్శనాల విజయవంతంపై తిరుమల అన్నమయ్య భవనంలో టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్, ఏఈవో వెంకయ్య చౌదరితో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. పదిరోజుల్లో 7.83 లక్షల మంది భక్తులు వైకుంఠ ద్వారం ద్వారా దర్శనం చేసుకున్నారని, హుండీకి రూ.41.14 కోట్ల ఆదాయం వచ్చిందని వివరించారు.శుక్రవారం రికార్డు స్థాయిలో 83 వేల మంది స్వామివారిని దర్శించుకున్నారని తెలిపారు. భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందజేశామని , భక్తుల రద్దీని ఏఐ కమాండ్ కంట్రోల్ రూం ద్వారా నిరంతరం పర్యవేక్షణ జరిపామని పేర్కొన్నారు. సామాన్య భక్తులు సౌకర్యవంతంగా స్వామివారిని దర్శించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లతో పాటు అవసరమైన వసతి గదుల కేటాయింపు చేశామని అన్నారు. ఉద్యావనం విభాగం ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో రంగనాయక ఆలయ సెట్ భక్తులకు విశేషంగా ఆకట్టుకుందని తెలిపారు. ఇందుకు అవసరమైన 50 టన్నుల సాంప్రదాయ పుష్పాలు, 10 టన్నుల ఫలాలు, 4 టన్నుల కట్ ఫ్లవర్స్‌తో డెకోరేషన్ చేశామన్నారు. కల్యాణ కట్టలో 2.06 లక్షల మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారని చైర్మన్ వివరించారు.

# హంసి ణీ డిజి స్కూల్‌లో ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు



రాజన్న సిరిసిల్ల,జనవరి 9: నేటినిజం (ప్రతినిధి): వేములవాడ పట్టణం హంసిణి డిజి స్కూల్ లో ముందస్తు సనీక్రాతి పండుగను జరుపుకున్నారు. ఇనీదులో భాగంగా పిల్లలకు రంగోలి పోటీలను నిర్వహించగా పిల్లలు ఎంతో ఉత్సాహంగా పాల్గొని అందమైన ముగ్గులను వేసి మన సంస్కృతి , పండుగ విశిష్టతను తెలియజేశారు . ముగ్గుల పోటీలో గెలుపొందిన విద్యార్థినిలకు పాఠశాల కరస్పాండెంట్ నరాల సంతోష్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పిల్లలు, టీచర్లు పాల్గొన్నారు.


Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**

RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com